ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
శనివారం 14 జూన్ 2025

ఉద్యాన పంటల పరిశోధనలు ఏవీ?
● ఎనిమిదేళ్లుగా ఎక్కడి గొంగళి అక్కడే... వృథాగా 79 ఎకరాలు
● బోర్డుకే పరిమితమైన ఉద్యాన పరిశోధనల కేంద్రం
● అమలుకు నోచుకోని డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ఆదేశాలు
● ఉద్యానవన శాఖ లక్ష్యం పూర్తయ్యేది ఎప్పుడో?
6

చంద్రబాబుకు 'వందనం'

- చెప్పినట్టే... మాట తప్పకుండా
- ఎంత మంది పిల్లలున్నా తల్లికి వందనం
- 2,41,119 మంది విద్యార్థులకు..
- తల్లుల ఖాతాల్లో రూ.313 కోట్లు
- పేద కుటుంబాల్లో హర్షం



(కడప - ఆంధ్రజ్యోతి): అవును.. పేదింటి, మధ్య తరగతి తల్లులు చంద్రబాబుకు వంద నం అంటున్నారు. ఎన్నికలలో సూపర్‌సిక్స్. ఇచ్చిన హామీలో భాగంగా తల్లికి వందనం పేరిట తల్లుల ఖాతాల్లో రూ.13వేలు డబ్బులు జమ అవుతున్నాయి. చెప్పినట్లే మాట తప్పకుండా ఎంతమంది పిల్లలుంటే అంతమందికి డబ్బులు ఖాతాల్లో పడుతున్నాయి. కూటమి ఏర్పడి ఏడాదైనా సందర్భంగా గురువారం ఈ పథకాన్ని ప్రారంభించినప్పటికీ శుక్రవారం నాటికి తల్లుల ఖాతల్లో డబ్బులు జమ అవుతూ వస్తున్నాయి. బ్యాంకుల్లో తల్లుల ఖాతాల్లో క్రెడిట్ అయినట్లు మెసేజ్ వస్తుండడంతో తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేకుండా పోతున్నాయి. జిల్లాలో తల్లుల ఖాతాల్లో రూ.313 కోట్లు జమ కానుంది. ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు, 1వ తరగతి అడ్మిషన్‌ల నమోదుతో ఇంకా లబ్ధిదారుల సంఖ్య భారీగా పెరగనుంది.

చెప్పినట్లుగానే.. మాట తప్పకుండా అమలు

ఎంత మంది పిల్లలు చదువుకుంటుంటే అంతమందికి తల్లికి వందనం పేరిట ఖాతాలో డబ్బులు వేస్తామని పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్, ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. అందుకు తగ్గట్టుగానే తల్లికి వందనం అమలు చేస్తున్నారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 2,41,119 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. వీరికి ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున రూ.3,60,67,085 ప్రభుత్వం చెల్లించనుంది. అయితే పాఠశాల మెయింటెనెన్స్ కోసం రూ.2వేలు లెస్ చేసి ఆ నిధులను పాఠశాలల నిర్వహ ణకు జమ చేయనున్నారు. దీంతో తల్లుల ఖాతాల్లో ఒక్కో పిల్లోడికి రూ.13వేల చొప్పున 1,52,120 మంది తల్లుల ఖాతాల్లో రూ.3,13,45,047 జమ కానుంది. లబ్ధిదారుల జాబితాను ఆయా సచివాలయాలకు పంపించారు. ఏదేని సాంకేతిక సమస్యలతో అర్హత సాధించినా కూడా రాని వారికి సమస్య పరిష్కారానికి ఈనెల 26 వరకు గడువు ఇచ్చారు. అప్పట్లో దరఖాస్తు చేసుకోని వీరందరికీ మళ్లీ 30న తుది జాబితా ప్రకటిస్తారు. అర్హత ఉన్న పిల్లల్లో తల్లి లేని పక్షంలో సంరక్షకుడు ఖాతాలో చేస్తారు. అనాథలై ఉంటే కలెక్టరు నిర్ణయించిన ప్రకారం వారి ఖాతాలో జమ కానుంది.

ఈ ఫోటోలో పోరుమామిళ్ల మండలంలోని సూరిసిద్దుపల్లెకు చెందిన గొడ్లవీటి లక్ష్మి సరస్వతి-రోశయ్యలు. వీరికి ముగ్గురు పిల్లలున్నారు. వ్యవసాయ కుటుంబం. పొలం పనులు చేసుకుంటూ పిల్లలను చదివిస్తున్నారు. పెద్దపాప టేకూరుపేట జిల్లాపరిషత్ హైస్కూలులో మిగతా ఇద్దరు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. ఈ ముగ్గురికి తల్లికి వందనం జమ అయింది.



● ఎకోపల్లెకు చెందిన జయలక్ష్మి. ఈమెకు ఇద్దరు పిల్లలు. భర్త చనిపోయాడు. కుమారుడు ఓబులేసు 8వ తరగతి, కూతురు వరలక్ష్మి 7వ తరగతి చదువుతుంది. కుటుంబ పెద్ద చనిపోవడంతో ఆమె పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఇళ్లల్లో పనిచేసుకుంటూ పిల్లలను పోషిస్తోంది. తల్లికి వందనంతో ఇరువురికి రూ.26వేలు జమ కావడంతో ఆమె ఆనందానికి అవధుల్లేవు.

-జయలక్ష్మి
ఎకోపల్లె,
దువ్వూరు
మండలం





ఈ ఫోటోలో ఉన్నది వల్లూరు మండలం తోళ్లగంగనపల్లెకు చెందిన సల్మా కుటుంబం. వీరికి ముగ్గురు పిల్లలున్నారు. కూలీ పనులు చేసుకుని బతుకుతున్నారు. పెద్ద కుమా రుడు అబ్దుల్లా కడపలోని బ్లూబెల్స్ పాఠశాలలో చదివిస్తుండగా, మిగతా ఇద్దరు ఆయేషా, ఆసిఫాలు తోళ్లగంగనపల్లె ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. ముగ్గురికి తల్లికి వందనం ద్వారా రూ.39వేలు వీరి ఖాతాలో జమ అయ్యాయి.



చంద్రబాబుకు రుణపడి ఉంటాం..

- శారదా - రవినాయక్

వేంపల్లె మండలం బక్కన్నగారిపల్లెకు చెందిన రవినాయక్ - ఎల్.శారద దంపతులు నిరుపేదలు. స్థానికంగా వేంపల్లెలో పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుం టున్నారు. వీరికి ఐదుగురు సంతానం. మనీషా, అవంతిక, అనుష్క, దినేశ్వరి, అఖిల్‌లు ఉన్నారు. మనీషా తాళ్లపల్లె జడ్పీ హైస్కూలులో పదో తరగతి, అవంతిక 8వ తరగతి చదువుతున్నారు. అనుష్క కూడా అక్కడే చదువుతోంది. అఖిలేశ్ 3వ తరగతి, దినేశ్వరి 2వతరగతి బక్కన్నగారిపల్లెలో చదువుతున్నారు. వీరంతా అర్హుల జాబితాలో ఉన్నారు. అయితే శుక్రవారం సాయంత్రానికి ముగ్గురి అమౌంటు తల్లి అకౌంటులో జమ అయింది. ఒకేసారి రూ.39వేలు పడడంతో ఆ కుటుంబంలో ఆనందంలో ఉంది.

మా కుటుంబాన్ని ఆదుకున్నారు

- తల్లిదండ్రులు చెన్నకేశవులు-లక్ష్మి
వాసుదేవపురం, దువ్వూరు

తల్లికి వందనం కింద మా ముగ్గురు పిల్లలకు రూ.39వేలు జమ అయింది. మాపిల్లలు సాయివిష్ణు 8, సాయికార్తీక్ 6, ఆదిత్య 3వ తరగతి చదువుతున్నారు. సాయి పుల్లారెడ్డిపేటలో, మిగతా ఇద్దరు వాసుదేవపురంలో చదువుతున్నారు. మేం కూలీ నాలీ చేసుకుని జీవిస్తున్నాం. చంద్రబాబు తల్లికి వందనం పేరిట మా ముగ్గురు పిల్లలకు రూ.39వేలు ఇచ్చి మా కుటుంబాన్ని ఆదుకున్నారు.



ఈ ఫోటోలో ఉన్నది క్రిష్ణవేణి. వారి పిల్లలు రూపశ్రీ, సందీప్, మోక్షిత్‌రామ్, వీరి స్వగ్రామం సిద్దవటం మండలం కడపాయపల్లె హరిజనవాడ. ప్రస్తుతం కడపలోని వరదకాలనీలో నివాసం ఉంటున్నారు. ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం కింద రూ.39వేలు జమ అయింది. చంద్రబాబుకు రుణపడి ఉంటామని తెలిపారు.



ఏపీ మోడల్ స్కూల్స్‌లో బదిలీల షెడ్యూల్ విడుదల

కడప ఎడ్యుకేషన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జోన్-4 పరిధిలో గల మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లు (పీజీటీ), ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు (టీజీటీ) బదిలీల కోసం ప్రభుత్వం షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్ తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరగనుందన్నారు. సంబంధిత టీచర్లు తమ దరఖాస్తులు, అభ్యంతరాలను, వెబ్ ఆప్షన్లను కింది షెడ్యూల్ ప్రకారం సమర్పించాల్సి ఉంటుందని సూచించారు.

షెడ్యూల్ ఇలా... ఈనెల 13వ తేదీన ప్రధానోపాధ్యాయులు, పీజీటీలు, టీజీటీలు తమ స్వయం ప్రమాణిత వివరాలతో బదిలీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అదే రోజు దరఖాస్తుల పరిశీలన కూడా జరుగుతుంది. ప్రవేశిక సీనియారిటీ జాబితా, అర్హత పాయింట్ల ఆధారంగా జాబితా వెబ్‌సైట్‌లో ప్రదర్శిస్తారు. 14వ తేదీన అభ్యంతరాలుంటే సంబంధిత ఆధారాలతో వెబ్‌సైట్ ద్వారానే సంబంధిత అధికారి వద్దకు సమర్పించవచ్చు. అనంతరం సంబంధిత అధికారి ద్వారా అభ్యంతరాల పరిష్కారం జరిగి, తుది సీనియా రిటీ జాబితా అర్హత పాయింట్లతో వెబ్‌సైట్‌లో ఉంచబడుతుంది. ప్రధానోపా. ధ్యాయులు, పీజీటీలు, టీజీటీలు వెబ్‌ఆప్షన్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈనెల 15వ తేదీ బదిలీ స్థానాల కేటాయింపు ప్రక్రియ పూర్తవుతుంది. ఈ బదిలీ ప్రక్రియలో పాల్గొ నేవారు ప్రభుత్వం సూచించిన తేదీలను తప్పనిసరిగా గమనించి, సంబంధిత కార్యా చరణను సకాలంలో పూర్తి చేయాల్సిందిగా జోన్-14లో గల జిల్లా విద్యాశాఖాధికారులకు తెలిపారు. ఇతర వివరాలకు హెచ్‌టీటీపీ ఎస్://ఏపీఎంఎస్‌ట్రాన్స్‌ఫర్స్ ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్/లాగిన్ వెబ్‌సైట్‌లో తెలుసుకోవా లన్నారు.

సమాచార శాఖ ఏడీగా పద్మజ బాధ్యతలు

కడప కలెక్టరేట్, జూన్ 13 (ఆంధ్రజ్యో తి): జిల్లా సమాచారశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పద్మజ శుక్రవారం బాధ్యత లు స్వీకరించారు. ఆమె చిత్తూరు జి ల్లా సమాచారశాఖ ఏడీగా విధులు నిర్వహిస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు జర్నలిస్టుల సంక్షేమానికి, ప్ర భుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ప థకాలు, అధికార కార్యక్రమాలను మీడియా ద్వారా విస్తృతం చేస్తామ న్నారు. కార్యక్రమంలో ఏఈఐ శ్రీని వాసరావు, డివిజనల్ పీఆర్వో సునీల్ సాగర్, పీఆర్వో రవికుమార్, ఏవీఎస్ నాగయ్య, రికార్డు అసిస్టెంట్ ఈశ్వరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న పద్మజ

ఇంటర్మీడియట్ విద్యార్థి ఖాతాకే.. తల్లికి వందనం

కడప ఎన్టీఆర్ సర్కిల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) :ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్సీ విద్యార్థుల ఖాతాకే తల్లికివందనం నిధులు జమ అవుతాయని సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.సరస్వతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే విద్యార్థులకు బ్యాంకు ఖాతాలు ఉంటే ఆ ఖాతాలకు ఫోను లింకు చేయించుకోవాలని, ఎన్పీసీఐ లింకు కూడా చేయించుకుంటే నేరుగా నిధులు ఖాతాకు జమ అవుతాయని పేర్కొన్నారు. ఒకవేళ విద్యార్థికి ఇప్పటికీ అకౌంటు లేకపోతే వెంటనే సమీపంలోని బ్యాంకు లో ఖాతా ఓపెన్ చేయించుకుని ఎన్పీసీఐకి లింకు చేయించుకోవాలని సూచించారు.

కొండాపురంలో మరో మూడు రైళ్లు ఆపాలి

కొండాపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కొండాపురం రైల్వేస్టేషన్‌లో మరో మూడు రైళ్లు ఆపేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైల్వే కమిటీ సభ్యులు కోరారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో శుక్రవారం స్టేషన్ కన్‌సల్టేటివ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఇటీవల కొండాపురంలో తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలుకు కొండాపురంలో స్టాపింగ్ ఇచ్చారని, దీంతో పాటు మరో మూడు రైళ్లకు వెంటనే స్టాపింగ్ ఇచ్చేందుకు రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. టికెట్లు విక్రయం జరిగితే మరిన్ని రైళ్లు ఆపుతామని రైల్వే ఉన్నతాధికారులు చెప్పారని వారు తెలిపారు. దీంతో కొండాపురం రైల్వేస్టేషన్‌లో ఎక్కే ప్రతి ప్రయాణీకుడు టికెట్టు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ (16381/ 16382), వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ (12797 / 12798), చెన్నై-ముంబై ఎక్స్‌ప్రెస్ (22159 / 22160) ఈ మూడు రైళ్లు వెంటనే కొండాపురంలో స్టాపింగ్ ఇచ్చేలా రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులు స్టేషన్ సూపరెండెండెంట్ గురుప్రసాద్‌కుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మనోహర్‌బాబు, జోసఫ్, జయంతు, సుబ్బారావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

బద్వేలులో భూకబ్జాలకు చెక్

- క్యూఆర్ కోడ్‌తో పట్టాలు తయారు చేసిన ఆర్డీవో
- ట్యాంపరింగ్‌కు అవకాశాలు లేకుండా సాంకేతిక పరిజ్ఞానంతో పట్టాలు



సుశీలమ్మకు క్యూఆర్ కోడ్‌తో ఉన్న పట్టాలు అందిస్తున్న ఆర్డీవో, ఎమ్మార్వో

(కడప - ఆంధ్రజ్యోతి): బద్వేలు అంటేనే భూకబ్జాలు, నకిలీ పట్టాలకు అడ్డాగా మారింది. జగన్ ఐదేళ్ల హయాంలో జరిగిన భూకబ్జాలు మునుపెన్నడూ జరగేదు. వైసీపీ నేతలు ఇష్టారాజ్యంగా ఆక్రమించేశారు. ఏకంగా రెవెన్యూ రికార్డులను ట్యాంపరింగ్ చేశారు. బ ద్వేలు, గోపవరం తహసీల్దారు కార్యాలంలో ఉండాల్సిన రికార్డులన్నీ కొందరు వైసీపీ నేతలు, కబ్జారాయుళ్ల చేతుల్లో ఉండేవి. దీంతో ఇష్టారాజ్యంగా డి.న కిలీ పట్టాలు తయారు చేశారు. గత ప్రభుత్వ హయాంలో 15వేలకు పైగా ఇంటిపట్టాలు పేదలకు అందించారు. అప్పట్లో బద్వేలు అభివృద్ధి కాకపోవడం, ఆ స్థలాలు దూరంగా ఉండడంతో ఆ పట్టాలు తీసుకున్నవారు ఇళ్లు నిర్మించుకోలేదు. అయితే వైసీపీ వచ్చాక ఆ ఇంటిపట్టాలకే నకిలీ పుట్టించారు. ఒక్కో స్థలం ఇది మాది మాదంటూ కొందరు రంగంలోకి వచ్చారు. రెవెన్యూ రికార్డులు కూడా ట్యాంపరింగ్ చేశారు. వెరశి బద్వేలు కబ్జాలమయంగా మారింది. పట్టా ఉన్నా కూడా ధైర్యం చేయలేని స్థితి. ఇది ఎవరైనా ఆ స్థలం మాదంటారో వారితో సెటిల్ చేసుకునే పరిస్థితి. అయితే ఇప్పుడు అలాంటి కబ్జాలకు తెరతీస్తున్నారు. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ భూకబ్జాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. అన్యాక్రాంతమైన భూములు తిరిగి స్వాధీనం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బద్వేలు ఆర్డీవో చంద్రమౌళి కలెక్టరు ఆకాంక్షను తూచా పాటిస్తున్నారు. భూకబ్జా జరిగితే వాటిని తిరిగి స్వాధీనం చేసుకునే పనిలో బద్వేలు ఆర్డీఓ తలమునకలై ఉన్నారు. కలసపాడు, కాశినాయన, బికోడూరు, బద్వేలు మండలాల్లో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను గుర్తించి కలెక్టరు ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకుంటున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 900 ఎకరాలు ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమైనట్లు గుర్తిస్తే వాటిలో బద్వేలు డివిజనులోనే 859.69 ఎకరాలు గుర్తించారు. అంటే అక్కడ ఆర్డీవో చంద్రమౌళి పనితీరు అర్థమవుతుంది. ఓ పక్క ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకోవడంతో పాటు బద్వేలు మున్సిపాలిటీలో బద్వేలు, గోపవరం మండలాల్లో భూకబ్జాదారులపై దృష్టి పెట్టారు. ఇక్కడ భూకబ్జాలకు వీలు లేకుండా ఉండే విధంగా గతంలో ఎప్పుడూ లేని విధంగా క్యూఆర్ కోడ్‌తో ఉన్న ఇంటి పట్టాలను ఇచ్చేందుకు ఎలక్ట్రానిక్ జనరేట్ పట్టాలను ఇచ్చేందుకు శ్రీకారం చుట్టారు ప్రయోగాత్మకంగా బద్వేలు మున్సిపాలిటీలో అమలు చేస్తున్నారు. శుక్రవారం గుంతపల్లె మున్సిపల్‌లోని సర్వేనెం.907లో ప్లాట్ నెం.422 గల ఇంటిస్థలాన్ని భైరపు సుశీలమ్మకు తహసీల్దారు ఉదయభాస్కర్‌తో కలిసి అందించారు. ట్యాంపరింగ్‌కు అవకాశం లేకుండా దీనిని రూపొందించారు.

ట్యాంపరింగ్ లేని రికార్డులే లక్ష్యం

బద్వేలు మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున రికార్డుల ట్యాంపరింగ్ జరిగింది. ఒకే ప్లాటుపై ఇద్దరు ముగ్గురికి పట్టాలున్నాయి. దీని వల్ల శాంతిభద్రతల సమస్య వస్తుంది. భవిష్యత్తులో భూకబ్జాలు లేకుండా నిరోధించేందుకు కలెక్టరు చెరుకూరి శ్రీధర్ సూచనల మేరకు వినూత్న ఆలోచన చేసి క్యూఆర్‌కోడ్‌తో ఉన్న పట్టాలు ఇస్తున్నాం. దీంతో ట్యాంపరంగ్ చేసే అవకాశం ఉండదు.

- ఆర్డీవో చంద్రమౌళి

టీడీపీ జెండాలు, తోరణాల కాల్చివేత ఘటనలో...
12 మందిపై హత్యాయత్నం కేసు

పులివెందుల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో టీడీపీ జెండాలు, తోరణాలను పీకేసి నిప్పుపెట్టి కాల్చిన సంఘటనకు సంబంధించి 12 మందిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గురువారం కదిరిరోడ్డులోని రింగురోడ్డు వద్ద టీడీపీ జెండాలు, తోరణాలను పీకేసి నిప్పుపెట్టి కాల్చిన సంఘటన తెలిసిందే. కాగా, అదే సమయంలో టీడీపీ కార్యకర్త సంజీవ్ అడ్డుకునే ప్రయత్నం చేయగా అతనిపై ఇనుప రాడ్లతో దాడి చేశారన్నారు. దీంతో అక్కడి నుంచి పారిపోయి ప్రాణాలు కాపాడు కున్నా రన్నారు. సంజీవ్ ఫిర్యాదు మేరకు బాలాజీనాయక్, త్రినాథ్‌నాయక్, షేక్ మహబూబ్ నారబ్, మోటా వేదాంత్‌లతో పాటు మరో 8 మందిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీరి నలుగురిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు అర్బన్ సీఐ చాంద్‌బాష, ఎస్ఐ నారాయణలు తెలిపారు.



డీఎస్పీతో మాట్లాడుతున్న మహిళలు

మా పిల్లలకు ఏ పాపం తెలియదు...

● పోలీసు స్టేషన్ ఎదుట మహిళల అందోళన

టీడీపీ తోరాణాలు, జెండాలు పీకేసి నిప్పుపెట్టిన సంఘటనలో తమ పిల్లలకు అభంశుభం తెలియదని, వారు చదువుకునే పిల్లలని.. వారి జీవితాలను నాశనం చేయొద్దంటూ మహిళలు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. దాదాపు గంటన్నర పాటు మహిళలు కన్నీరుమున్నీరవుతూ పోలీసులను ప్రాధేయపడ్డారు. గురువారం రాత్రి విచారణపేరుతో తీసుకొచ్చారని, వారికి ఏమైందో ఆందోళనగా ఉందని, వెంటనే తమకు చూపించాలని పట్టుబట్టారు. చదువుకుంటున్న పిల్లలకు పార్టీల జెండాలతో ఏం అవసరం ఉంటుందని ఆరోపించారు. మాకు వైసీపీ, టీడీపీతో పాటు ఏ పార్టీతో సంబంధం లేదని వారు మీడియా ముందు విలపించారు. ముందుగా సీఐ చాంద్‌బాష ఆందోళన చేస్తున్న మహిళలతో మాట్లాడినా వారు ఆందోళన విరమించలేదు. చివరకు డీఎస్పీ మురళీ నాయక్ జరిగిన సంఘటనపై పూర్తిస్థాయి విచారణ చేసిన అనంతరం మీ పిల్లల తప్పు లేకుంటే పంపించేస్తామని చెప్పడంతో మహిళలు ఆందోళన విరమించారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

గుర్రంకొండ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థిని వైష్ణవి అదృశ్యంపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ గజేంద్ర తెలిపారు. టి.రాచపల్లెకు చెందిన దేవేంద్ర కుమార్తె అంగళ్ల సమీపంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ పూర్తి చేసింది. గత నెల 20వ తేదీన ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష రాయడానికి అంగళ్లకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి చేరుకుంది. అదే రోజు సాయంత్రం విద్యార్థిని ఇంటి నుంచి కనబడకుండా పోయింది. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారిని విచారించిన ఆచూకీ తెలియకపోడంతో శుక్రవారం పోలీసులను ఆశ్రయించారు. పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్‌ను బావిలో పడేసిన దుండగులు



బావి నుంచి ట్రాక్టర్‌ను వెలికి తీస్తున్న దృశ్యం

పెద్దమండ్యం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నిరుపేద యువకుడు ట్రాక్టర్ తోలుకుంటూ జీవిస్తుంటే ఆ ట్రాక్టర్‌ను బావిలో పడేసిన సంఘటన పెద్దమండ్యం మండలంలో గురువారం జరిగింది. బాధితుడు, గ్రామస్థుల కథనం మేరకు మండలంలోని బండమీదపల్లి వాసి నాగార్జున నిరుపేద కుటుంబం. కష్టపడి వ్యవసాయ కూలీ పనులు, డ్రైవర్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. 15 ఏళ్లు కష్టపడి కూడబెట్టుకున్న డబ్బుతో మూడేళ్ల కిందట రూ.7 లక్షలతో ఒక ట్రాక్టర్ తెచ్చుకుని బాడుగకు తోలుకుంటూ కుటుంబం జీవనం సాఫీగా సాగిస్తున్నాడు. గురువారం కూడా యధావిధిగా ట్రాక్టర్‌ను ఇంటి సమీపంలో పెట్టాడు. అర్ధరాత్రి మూత్ర విసర్జనకు లేచి చూస్తే ట్రాక్టర్ కనబడకపోవడంతో ఆందోళన చెందిన బాధితుడు సహచరులతో చుట్టు పక్కల ట్రాక్టర్ చక్రాలు జాడలు గమినించారు. గ్రామం సమీప వ్యవసాయ బావిలో పడి వున్నట్లు గుర్తించారు. శుక్రవారం పెద్దమండ్యం పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు విచారించి ఇలాంటి సంఘటన మళ్లీ జరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరారు. ఏడాదిగా పెద్దమండ్యం పోలీసు స్టేషన్‌లో సిబ్బంది కొరతతో గ్రామాల్లో రాత్రిళ్లు కాక పగలు కూడా గస్తీలు జరగలేదని ప్రజలు వాపోతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి



ఓబులవారిపల్లె, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మండలంలోని చిన్నఓరంపాడు పంచాయతీకి చెందిన పిడికిటి సుబ్రమణ్యం (73) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. పోలీసుల వివరాల మేరకు... సుబ్రమణ్యం ద్విచక్రవాహనంపై కడప-చెన్నై జాతీయ రహదారి రెడ్డిపల్లె చెరువుకట్ట సమీపంలో ఉన్న పొలం వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో తిరుపతివైపు వెళుతున్న స్విఫ్ట్ వీడీఐ వాహనం ఢీకొంది. దీంతో సుబ్రమణ్యం అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. మృతుడికి భార్య జయమ్మ, కుమారులు శివకుమార్, మహేష్, ఇద్దరు కుమార్తెలు మణెమ్మ, సరస్వతి ఉన్నారు. మృతుడి చిన్నకుమారుడు మహేష్ గత శనివారం నాడే బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశం వెళ్లాడు. వీరందరికి పెళ్లిళ్లు అయి పిల్లలు ఉన్నారు.

జేఎన్టీయూ మొదటి ఏడాది
ఇంజనీరింగ్ ఫలితాల వెల్లడి



ఫలితాలు ప్రకటిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు

కలికిరి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలల్లో బీటెక్ మొదటి సంవత్సరం ఫలితాలను శుక్రవారం ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రావు ప్రకటించారు. మొదటి ఏడాది (2024-25) రెండో సెమిస్టర్ ఫలితాలు, 2023-24 కంపార్ట్‌మెంటల్ పరీక్షా ఫలితాలను కూడా వెల్లడించారు. కలికిరి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు అటానమస్ స్థాయి దక్కిన తరువాత తొమ్మిదవ విడత ఫలితాలను వెల్లడించారని చెప్పారు. మొత్తం ఫలితాల్లో 66.23 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా ఇందులో ఈసీఈలో 95.16 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు. పరీక్షలు నిర్వహించిన రెండు వారాల్లోగా ఫలితాలు ప్రకటించడం ద్వారా రెండో సంవత్సరం మొదటి సెమిస్టర్ చదివే విద్యార్థులు ఈ ఫలితాలకు అనుగుణంగా విద్యా ప్రణాళికలను రూపొందించుకునే అవకాశం కలుగుతుందని ప్రిన్సిపాల్ చెప్పారు. ఫలితాలను కళాశాల నోటీసు బోర్డులోనూ, కాలేజీ వెబ్‌సైట్‌లోనూ పొందుపరుస్తామన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాలకు చెందిన వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకోండి

రైల్వేకోడూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): సోలార్‌ను వినియోగించుకుంటే విద్యుత్ భారం ఉండదని రాజంపేట విద్యుత్ శాఖ ఈఈ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరు విద్యుత్ శాఖ కార్యాలయ ఆవరణంలో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ రూఫ్ ఏర్పాటుపై బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చాయన్నారు. (సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు సామర్థ్యం లోడ్) 3 కిలోవాట్‌కు ఉత్పత్తి అయ్యే 360 యానిట్లకు ప్రాజెక్టు ధర రూ.2,30,000, ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.78,000 ఇస్తుందన్నారు. 4 కిలోవాట్లకు 480 యూనిట్లు ప్రాజెక్టు ధర 3,00000, 5 కిలోవాట్లకు 600 యూనిట్లకు 3,50,000 ప్రాజెక్టు ధర ఉంటుందన్నారు. వీటన్నింటికి రూ.78,000 కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ వస్తుందన్నారు. సోలార్ రూఫ్‌పై ఎక్కడా అపోహలు లేకుండా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సోలార్ రూఫ్ ఏర్పాటు చేసుకుంటే 90 శాతం కరెంటు బిల్లు ఆదా చేసుకోవచ్చన్నారు. సోలార్‌ను ఉపయోగించడం వల్ల బొగ్గు ఆధారిత విద్యుత్ తగ్గుతుందన్నారు. దీంతో సహజ వనరులను భావితరాలకు పొదుపు చేసిన వాళ్లవుతారన్నారు. సోలార్ అన్‌గ్రిడ్ నెట్‌మీటర్ ద్వారా వ్యాపార రీత్యా ఇన్‌స్టాల్ చేసుకున్న వారికి రాయితీ ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు ఏడీఈ భాస్కర్‌రావు, వెలుగు సీసీ నారాయణ, బ్యాంకర్లు, విద్యుత్ వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల పరిశోధనలు ఏవీ?

- ఎనిమిదేళ్లుగా ఎక్కడి గొంగళి అక్కడే... వృథాగా 79 ఎకరాలు
- బోర్డుకే పరిమితమైన ఉద్యాన పరిశోధనల కేంద్రం
- అమలుకు నోచుకోని డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ఆదేశాలు
- ఉద్యానవన శాఖ లక్ష్యం పూర్తయ్యేది ఎప్పుడో?



రీసెర్చ్ సెంటర్ భూముల సముదాయ ముఖద్వారం



భూములను పరిశీలిస్తున్న డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ మాధవి (ఫైల్)

బి.కొత్తకోట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కూరగాయలు, పూలసాగుపై శాస్త్రవేత్తలచే పరిశోధనలు చేసి నూతన వంగడాలను రూపొందించి ఉద్యానపంటల సాగులో అధిక ఉత్పత్తులు సాధించి, రైతులను ఆదుకోవాలన్న ఆశయంతో బి.కొత్తకోట మండలంలో ఏర్పాటు చేసిన ఉద్యాన పరిశోధన కేంద్రం దయనీయ స్థితిలో ఉంది. తాడేపల్లిగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ పరిధిలో రాష్ట్రంలో 20 పరిశోధనా కేంద్రాలుండగా, అందులో రాయలసీమలోని అనంతపురం, మహానంది, అనంతరాజుపేట, పులివెందుల, బి.కొత్తకోట మండల పరిధిలోని బయప్పగారిపల్లె కేంద్రంగా నెలకొల్పిన ఉద్యాన పరిశోధనా కేంద్రం ఒకటి. ఉద్యాన పంటల సాగుపై విప్లవాత్మక మార్పులకు ఈ కేంద్రం మూలం కావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కారణాలు ఏవైనా ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు. ఏళ్ల తరబడి బోర్డులకే పరిమితమైంది.

త్వరలో పరిశోధనా కేంద్రం అభివృద్ధి

యూనివర్సిటీ నిధులతో కొంత భూమిని చదును చేశాం. ఫెన్సింగ్ వేశాం. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం డీడీ కట్టాము. అది మంజూరైతే బోర్లు వేయించాలి. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్కేవీవై) ద్వారా రూ.1.30 కోట్ల నిధులకు అప్రూవల్ అయింది. నిధులు విడుదలైతే పూర్తి స్థాయి ఉద్యాన పంటల పరిశోధనలు జరుగుతాయి.

\- ప్రతాప్ ఉద్యాన శాస్త్రవేత్త, బయ్యప్పగారిపల్లి కేంద్రం

రూ.కోట్ల భూములను సమకూర్చిన టీడీపీ ప్రభుత్వం

2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో మండలంలోని బయప్పగారిపల్లి పంచాయతీ పరిధిలో ప్రధాన రహదారికి ఇరువైపులా రూ.కోట్ల విలువైన 79 ఎకరాల వ్యవసాయ భూమిని సేకరించింది.. ఇందులో అధునాతన భవన నిర్మాణం చేసి హార్టికల్చర్ యూనివర్సిటీ పర్యవేక్షణలో వ్యవసాయ శాస్త్రవేత్తలతో పూలు, కూరగాయల పంటలపై పరిశోధనలు జరపాలని భావించారు. ఆ పరిశోధనలను రైతులకు వివరించి, సాగుపై అవగాహన కల్పించి ఉద్యాన పంటల సాగులో నూతన సాంకేతికతతో కొత్త ఒరవడిని సృష్టించాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఈ పరిశోధనా కేంద్రం 8 ఏళ్లుగా నిద్రావస్థలోనే ఉంది. భూకేటాయింపు అనంతరం నిధుల కోసం ప్రతిపాదనల స్థాయిలో ఉండగానే ప్రభుత్వం మారడంతో పరిశోధనా క్షేత్ర పనులు ముందుకు సాగలేదు.



హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్ కోసం కేటాయించిన 79 ఎకరాల భూమి

డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ప్రకటించినా కూడా..

డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎం.మాధవి ఈ ఏడాది ఫిబ్రవరి 6న బి.కొత్తకోట మండలంలోని ఈ పరిశోధనా కేంద్రానికి వచ్చారు. కేంద్ర అభివృద్ధి, కార్యకలాపాల కోసం ప్రభుత్వాలు నిధులు కేటాయించకపోవడం వల్ల పరిశోధన కార్యక్రమాలు జరగలేదని తెలిపారు. యూనివర్సిటీ నిధులు రూ.25 లక్షలతో ప్రస్తుతానికి 5 ఎకరాలలో పరిశోధనాత్మక సాగును ప్రారంభిస్తామని, నేలను చదును చేసి, కొత్త బోర్లు వేయించి పూలు, కూరగాయల సాగులో పరిశోధనల కోసం ఇద్దరు వ్యవసాయ శాస్త్రవేత్తలను నియమిస్తామన్నారు. నెల రోజుల్లో 5 ఎకరాలలో ప్రారంభిస్తామని చెప్పి నాలుగు నెలలైనా ఇంతవరకు ఎటువంటి పనులు ప్రారంభం కాలేదు.

కార్యాలయ భవనమూ కరువే...

ఉద్యాన పరిశోధనా కేంద్రానికి 79 ఎకరాల భూములున్నా సొంత కార్యాలయ భవనం కూడా లేని దుస్థితి నెలకొంది. పక్కనే ఉన్న సిరికల్చర్ ఫాంలో ఓ గదిని కేటాయించడంతో నామమాత్రంగా అదే కార్యాలయంగా కానిచ్చేస్తున్నారు. ప్రస్తుతం మామిడి చెట్లు ఉన్న ప్రాంతంలో 5 ఎకరాల ప్లాటు కోసం ఫెన్సింగ్ మాత్రం వేశారు. నూతన భవన నిర్మాణం ఊసేలేదు. డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ ఉద్యానపరిశోధనా స్థానం అని బోర్డులు ఏర్పాటు చేయడం తప్ప ఎనిమిదేళ్లుగా చేసిందేమీ లేదు. ఇప్పటికైనా చేస్తారా అని రైతులు ఎదురు చూస్తున్నారు.



సిరికల్చర్ ఫాంహౌస్‌లో తాత్కాలికంగా ఉన్న రీసెర్చ్ కార్యాలయం

సోలార్ రూఫ్‌టాప్‌తో విద్యుత్ ఆదా



గుర్రకొండలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి

గుర్రంకొండ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలు, రైతులు సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ ఆదాతో పాటు కరెంట్ బిల్లులను తక్కువ మొత్తంలో చెల్లించడానికి మంచి పథకమని ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన గుర్రంకొండ సబ్‌స్టేషన్‌లో రైతులు, ప్రజలతో శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సోలార్ రూఫ్‌టాప్ పథకంలో 1 కిలో వాట్ నుంచి 3 కిలో వాట్స్ వరకు సబ్సిడీతో ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. దీంతో ప్రజలకు కరెంట్ బిల్లుల భారం బాగా తగ్గుతుందన్నారు. సూర్యఘర్ పథకంలో విద్యుత్ ఆదాతో పాటు ఇళ్లకు కరెంట్ సమస్య ఉండదన్నారు. గ్రామాల్లో ప్రజలు పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏడీ శివయ్య, సబ్ ఇంజనీర్ మోసీన్, సిబ్బంది పాల్గొన్నారు.


సోలార్‌తో విద్యుత్ ఆదా..

వాల్మీకిపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీతో ఇస్తున్న సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవడం ద్వారా విద్యుత్ ఆదా చేసుకోవచ్చని ట్రాన్స్‌కో ఈఈ ంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సమీపంలోని పునుగుపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ నందు ప్రధానమంత్రి సూర్యాఘర్ యోజన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటులో 1కిలోవ్యాట్‌కు 120యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి, ప్రభుత్వ సబ్సిడీ రూ.30వేలు, 2కిలో వ్యాట్‌లకు 240యూనిట్లు ఉత్పత్తి రూ.60వేలు సబ్సిడీ, 3కిలో వ్యాట్‌లకు 360 యూనిట్లు ఉత్పత్తి రూ.78వేలు సబ్సిడీలతో ఈ పథకాన్ని గృహ వినియోగ దారులకు మాత్రమే మంజూరు చేయడం జరుగుతుందన్నారు. సోలార్ ఏర్పాటు ద్వారా విద్యుత్ బిల్లును కూడా ఎంతో ఆదా చేస్తుందని గృహ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కోసూరి చంద్రమౌళి, టీడీపీ రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, జిల్లా పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, టీడీపీ మండలపార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, ఏఈ రాజశేఖర్, సబ్ ఇంజనీర్ జాకీర్‌హుస్సేన్, నాయకులు వీపీ నారాయణ, రాజేంద్రాచారి, కోసూరి రమేశ్, శేషాద్రిరెడ్డి, బొక్కసం బ్రదర్స్ ట్రాన్స్‌కో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు

- విద్యుదాఘాతంతో వానరం మృతి
- సంప్రదాయబద్ధంగా ఖననం
- అంత్యక్రియల్లో పాల్గొన్న హిందూ, ముస్లింలు




పాపిరెడ్డిగారిపల్లెలో చనిపోయిన వానరం, వానరానికి అంత్యక్రియలకు సిద్ధం చేసిన గ్రామస్తులు

కలకడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన వానరానికి అంత్యక్రియలు చేశారు. కలకడ మండలం పాపిరెడ్డిగారి పల్లెలో వెలుగు చూసిన సంఘటనలోకెళితే... విద్యుదాఘాతంతో చనిపోయిన వానరానికి గ్రామమంతా ఏకమై ఘనంగా అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. శుక్రవారం పాపిరెడ్డిగారిపల్లె మసీదు వద్ద వానరాలు వెళుతుండగా ప్రమాదవశాత్తు ఓ వానరం విద్యుత్ తీగలకు తగలడంతో మృతి చెంది కిందపడిపోయింది.

ఇది గమనించిన స్థానికులు మనిషికి అంత్యక్రియలు చేసే విధంగానే వానరానికి అంత్యక్రియలు నిర్వహించారు. తొలుత హిందువులు అంతిమయాత్రకు ముందుకు రాగా అక్కడే ఉన్న ముస్లింలు, మహిళలు ముందుకు వచ్చి ఘనంగా ఏర్పాట్లు చేశారు.

వానరం కళేబరానికి వరిగడ్డి, కొత్త తెల్లబట్టతో పాడె కట్టి స్నానం చేయించి సుగంధ ద్రవ్యాలు చల్లడం, పూలమాలలు వేసి అగరబత్తీలు వెలిగించి, టెంకాయలు కొట్టి కర్పూర హారతులిచ్చారు. సాధారణంగా మనిషి తరహాలోనే పాడె మోస్తూ బాణాసంచా పేల్చుతూ మంగళవాయిద్యాలు, డప్పువాయిద్యాల నడుమ గ్రామస్థులు కోతికి అంతిమయాత్రను నిర్వహిస్తూ స్థానిక గొల్లపల్లె రోడ్డులో ఖననం చేశారు. కార్యక్రమంలో బోడోళ్ల రాజారెడ్డి, రహంతుల్లా, 104 రమేశ్, సమిడిశెట్టి అమరనాథ్, చంద్ర, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నాటిన మొక్కలు తొలగింపు



ప్రభుత్వ భూమిలో అక్రమంగా నాటిన మొక్కలను తొలగిస్తున్న దృశ్యం, చిట్టిబోయినపల్లెలో రోడ్డు పక్కనున్న విలువైన ప్రభుత్వ భూమిలో నాటిన మొక్కలు

- **ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు**

గుర్రంకొండ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో అక్రమంగా నాటిన మామిడి, నేరెడు, టెంకాయ మొక్కలను రెవెన్యూ సిబ్బంది శుక్రవారం తొలగించారు. చిట్టిబోయినపల్లె రెవెన్యూ గ్రామంలోని సర్వే నెంబరు 87/8లో 2.30 ఎకరాల ప్రభుత్వ భూమి ని రెండు నెలల కిందట వైసీపీ నేతలు అక్రమించుకుని అమ్మడానికి సిద్ధం చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వ భూమి ఆక్రమణపై పత్రికలో కథనాలు ప్రచురితమవడంతో రెవెన్యూ అధికారులు అడ్డుకుని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. దీంతో నెల రోజులకు పైగా అక్రమార్కులు మిన్నకుండిపోయారు. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల కిందట అక్రమార్కులు రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డును తొలగించి రాత్రి పూట ప్రభుత్వ భూమిని చదును చేసి అందులో మొక్కలను నాటారు.

ఈ విషయం తహసీల్దార్ దృష్టికి వెళ్లడంతో అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని వీఆర్వోకు సూచించారు. ఈ క్రమంలో వీఆర్వో భరత్‌నాయక్ శుక్రవారం ప్రభుత్వ భూమిలో అక్రమంగా నాటిన మొక్కలను కూలీల సాయంతో తొలగించి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయించారు. మరోమారు ప్రభుత్వ భూమిలోకి ప్రవేశిస్తే వారిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు.

జూలై 7న రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికలు

నందలూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నందలూరు రైల్వే కేంద్రంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌కు జూలై 7న ఎన్నికలు జరిపేందుకు గుంతకల్ సీనియర్ డివిజనల్ పర్సనల్ అధికారి ఈనెల 12న నోటిఫికేషన్ విడుదల చేశారని రైల్వే ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ విశ్వనాధ్ తెలిపారు. శుక్రవారం మాట్లాడుతూ ఈ నోటిఫికేషన్‌లో ప్రిన్సిపల్ ఆఫీసు బేరర్స్‌గా సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, ట్రెజరర్ పోస్టులకు పోటీ చేయవచ్చునని కమిటీ మెంబర్స్‌గా ఆరుగురు పోటీ చేయవచ్చునని అన్నారు. ఈ ఎన్నికల్లో ఓటు వేయాలంటే రైల్వే ఉద్యోగి డిసెంబరు 2024 నుంచి మే 2025 వరకు ఆరు నెలలుగా కంటిన్యూగా రైల్వే ఇన్‌స్టిట్యూట్ మెంబర్‌షిప్ శాలరీలో కట్ అయి ఉండాలని, మెంబర్‌షిప్ లిస్టులో ఎవరి పేరు అయినా లేకుంటే ఈనెల 16 లోపు వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్‌కు తెలుపుకోవాలని అన్నారు. ఫైనల్ ఓటర్ల లిస్టు ఈనెల 17న ప్రచురిస్తారని, నామినేషన్ ప్రక్రియ ఈనెల 19వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 23వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు స్వీకరిస్తారన్నారు. ఎలిజిబులిటీ మెంబర్స్ లిస్టును ఈనెల 25 తేదీ ప్రకటిస్తారని, నామినేషన్ల విత్‌డ్రా ఈనెల 27వ తేదీ చేసుకోవచ్చన్నారు. ఫైనల్ నామినేషన్స్ లిస్టును ఈనెల 28న ప్రకటిస్తారన్నారు. జూలై 7న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. అదేరోజు సాయంత్రం 5 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ జరుగుతుందని, గుంతకల్ డివిజనల్ అధికారులు, రైల్వే ఇన్‌స్టిట్యూట్ కేర్ టేకర్ సెక్రటరీ కె.విశ్వనాధ్ తెలిపారు.

కుమారుడిపై అక్రమ కేసు పెట్టారంటూ...
తండ్రి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న వెంకటరమణను అడ్డుకుంటున్న పోలీసులు

రాయచోటి టౌన్ జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బాలిక ఆత్మహత్య ఘటన కేసులో తన కుమారుడు తారకరత్నను పోలీసులు అక్రమంగా ఇరికించి జైలుకు పంపారంటూ రాయచోటి పోలీసు స్టేషన్ ఎదుట శుక్రవారం తారకరత్న తండ్రి వెంకటరమణ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వెంటనే పోలీసులు వెంకటరమణను పోలీసుస్టేషన్ నుంచి హుటాహుటిన స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం రాయచోటిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈనెల 11వ తేదీ రాయచోటి పట్టణ పరిధిలోని మిట్టవాండ్లపల్లెలో బాలిక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనలో ఆ బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు తారకరత్న అనే యువకుడిని అరెస్టు చేశారు. తన కుమారుడిని అనవసరంగా కేసులో ఇరికించారని మనస్థాపానికి గురై వెంకటరమణ పోలీసుస్టేషన్ ఎదుట పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బాలిక మృతి వెనుక తన కుమారుడి పాత్ర ఏమీలేదని, రాజకీయ ఒత్తిడితోనే తమ కుమారుడిపై పోలీసులు అక్రమంగా కేసుపెట్టి జైలుకు పంపారని తారకరత్న తల్లి పేర్కొన్నారు.

బాలిక ఆత్మహత్య కేసులో ముగ్గురి అరెస్టు

మిట్టావాండ్లపల్లెలో ఈనెల 11వ తేదీన ఉరి వేసుకొని బాలిక ఆత్మహత్య చేసుకున్న కేసులో శుక్రవారం రాయచోటి అర్బన్ పోలీసులు తారకరత్న, వెంకటస్వామి, మణెమ్మలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపెట్టినట్లు అర్బన్ సీఐ వెంకటాచలపతి తెలిపారు.

విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ కార్యవర్గం
నియామకానికి దరఖాస్తు చేసుకోండి

రాజంపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట రెవెన్యూ సబ్ డివిజన్‌లో విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ కార్యవర్గ నియామకానికి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సబ్ కలెక్టర్ నిదియాదేవి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోఎంఎస్ 99, సాంఘిక సంక్షేమ శాఖ 09.12.2015న పొందుపరిచిన మార్గదర్శకాల మేరకు షెడ్యూల్డ్ కులాలు, తెగల సంఘం నుంచి ఇద్దరు, ప్రభుత్వేతర వర్గాలకు సంబంధించి మరో ఇద్దరు సభ్యుల నియామకం ఉంటుందన్నారు. అర్హులైన సామాజిక స్పృహ కలిగి వివాదరహితులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 17వ తేదీ లోపు రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు.

బడి రుణం కొంత తీర్చుదామని..!



వారంతా చదువులమ్మ చెట్టు కొమ్మలు. చదువు విలువ ఎరిగి కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలతో పాటు దేశ, విదేశాల్లో స్థిరపడ్డారు. కష్టపడి చదివాం, మన బతుకేదో తాము బతికేద్దాం అనుకోలేదు. తమ ఉన్నతికి పునాదిగా నిలిచిన సరస్వతి నిలయానికి వారు తమ హృదయాల్లో చోటు కల్పించారు. ఈ పాఠశాలలో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించిన సుమారు 15 మంది పూర్వ విద్యార్థులు ఒక సంఘంగా ఏర్పడ్డారు. చదువుకున్న బడి రుణం ఎప్పటికీ తీర్చుకోలేమని తెలిసినా, పదేళ్లుగా పాఠశాలలో ప్రాథమిక వసతుల కల్పనకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు

- పూర్వ విద్యార్థుల సేవానిరతి
- రూ.10 లక్షల వ్యయంతో మౌలిక వసతులు
- స్ఫూర్తిదాయకంగా పాత విద్యార్థుల సంఘం

ప్రొద్దుటూరు రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): . . ప్రొద్దుటూరు మండలం తాళ్లమాపురంలోని జడ్పీ హైస్కూలు అప్పట్లో సమీప గ్రామాలకు ఒక్కగానొక్క ఉన్నత పాఠశాల. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఎందరో విద్యార్థులు ఈ పాఠశాలలో విద్యను అభ్యసించారు. అప్పట్లో పాఠశాలలో ల్యాబ్, లైబ్రరీ, తాగునీరు, మరుగుదొడ్లు ఉండేవి కావు. అప్పట్లో ఆ పాఠశాలలో చదువుకున్న సుమారు 15 మంది విద్యార్థులు తమను తీర్చిదిద్దిన బడి రుణం తీర్చుకునేందుకు నిర్ణయించుకున్నారు.

పాత విద్యార్థుల సంఘం ఆవిర్భావం

2015లో తొలిసారిగా పాత విద్యార్థుల సమ్మేళనానికి తొలి అడుగు పడింది. జూనియర్స్, సీనియర్స్ అనే తేడా లేకుండా సుమారు 15 మంది తాళ్లమాపురం జడ్పీ హైస్కూలు పాత విద్యార్థుల సంఘంగా ఏర్పడ్డారు. పాఠశాలలో మౌలిక వసతుల మెరుగుపై ఎప్పటికప్పుడు ప్రధానోపాధ్యాయులు, సిబ్బందితో చర్చించి పాఠశాల అభివృద్ధికి నడుం బిగించారు. రిటైర్డు హెడ్మాస్టర్ గోపీనాథరెడ్డి హయాంలో పాఠశాల అభివృద్ధి పరుగులు తీసింది. ఆయన తన హయాంలో ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రాబట్టి, సౌకర్యాలు సమకూర్చగా మిగిలిన అంశాలను ఈ సంఘ సభ్యుల సహకారంతో కృషి చేశారు. పదవీ విరమణ అనంతరం ఆయన కూడా పూర్వ విద్యార్థుల సంఘంలో తాను ఒకరిగా చేరారు. ఆ తర్వాత వచ్చిన ప్రధానోపాధ్యాయులు కూడా పాత విద్యార్థుల కృషిని అభినందిస్తూ వారి సహాయ సహకారాలతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

మౌలిక వసతులపై దృష్టి

పాఠశాలలో దయనీయ స్థితిలో ఉన్న మరుగుదొడ్లకు టైల్స్, గులాబి కంచె వేయించారు. తలుపులను మార్చారు. ఓవర్‌హెడ్ ట్యాంకుఏర్పాటు చేశారు. కంప్యూటర్, సిబ్బంది గదుల్లో ఫ్లోరింగ్‌కు మరమ్మతులు చేశారు. మధ్యాహ్న భోజనం కోసం సుమారు 250 ప్లేట్లను అందజేశారు. 2015 నుంచి 2019 వరకు అన్ని తరగతుల విద్యార్థులకు ప్రతి సంవత్సరం నోట్‌బుక్కులు, స్టేషనరీ అందించారు. సుమారు లక్ష రూపాయల వ్యయంతో ఆర్వో ప్లాంటును సమకూర్చారు. దీని నిర్వహణను ఏటా నిధులను అందిస్తున్నారు. ప్రతి సంవత్సరం స్వాతంత్ర్య, గణతంత్ర్య దినోత్సవాల సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి పాఠ్యేతర కార్యకలాపాలకు ఏటా రూ.30 వేలు ఖర్చు చేస్తున్నారు. పాఠశాల లైబ్రరీకి పుస్తకాలు అందించారు. . 9, 10 తరగతుల విద్యార్థుల కోసం ప్రతి సంవత్సరం కొత్త కొశ్చన్‌బ్యాంక్ పుస్తకాలను అందిస్తున్నారు. పరీక్షలకు మార్గ దర్శనం చేసే వివిధ మ్యాగజైన్లను సమకూరుస్తున్నారు.




పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్, క్రికెట్ నెట్

క్రీడలకు ప్రోత్సాహం

మండల, జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు, డ్రస్సులను అందజేస్తున్నారు. విజేతలకు బహుమతులు అందిస్తున్నారు. స్కౌట్స్ గైడ్స్‌ల విద్యార్థుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిం చేందుకు యూనిఫాంలను అందజేశారు. పాఠశాల కార్యాలయంలో ఇన్వర్టర్లను, ల్యాప్‌టాప్, ప్రింటర్ తదితర ఉపకరణాలను అందుబాటులో ఉంచారు. సైన్స్ ల్యాబ్ పరికరాలు, సామగ్రిని అందుబాటులోకి తెచ్చారు. నూతనంగా నిర్మించిన గదులకు సుమారు రూ.60 వేలతో టైల్స్ ఏర్పాటు చేశారు. ఇటీవల క్రికెట్ క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించడానికి పాఠశాల ఆవరణంలో క్రికెట్ కిట్, నెట్‌పిచ్‌ను ఏర్పాటు చేశారు. బలహీనంగా ఉన్న తరగతి గది తలుపులను, తాళాలను మరమ్మతులు చేయించారు. పాఠశాల గోడలపై పెయింటింగ్ వేయించి క్రీడలు, గణితం, సైన్స్, పరిజ్ఞానం పెంచే చిహ్నాలతో కూడిన రంగుల చిత్రాలను వేయించారు. గడిచిన పదేళ్లలో రూ.9,92,844లను ఖర్చు చేశామని పాత విద్యార్థుల సంఘం తెలిపారు. సరైన దిశలో చొరవ తీసుకుని వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, సహకారాలను తీసుకుంటున్నారు.

అభివృద్ధికి పెద్దపీట

హెడ్మాస్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించాను. ఇక్కడి సౌకర్యాలు, వసతులను గమనించాను. ఇందులో పాతవిద్యార్థుల సంఘం కృషి ఎంతగానో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. పాఠశాల ఉన్నతికి ఎంత ఖర్చు అయినా వెనుకాడే పరిస్థితి లేదని ఎలాంటి అవసరమైన తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులు నాతో కూడా సంప్రదించారు. దాతల సహకారం పాఠశాలకు పుష్కలంగా ఉంది.

- విజయకుమారి, ప్రధానోపాధ్యాయురాలు

'రక్తదానంతో బాధితుల్లో భరోసా..'

కడప కలెక్టరేట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చే ద్దాం.. బాధితుల్లో భరోసా నింపు దామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖా ధికారి డాక్టర్ నాగరాజు పిలుపు నిచ్చారు. శుక్రవారం ప్రపంచ రక్తదాన దినోత్సవంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, ఏపీ ఎస్‌ఏసీఎస్ ఆదేశాల మేరకు నగరంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజనల్ బ్యాంకు, ప్రభుత్వ రక్తనిధి, సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)వారి సహకారంతో మెగా బ్లడ్ డొనేషన్ కార్యక్రమాన్ని ఎస్‌బీఐ చీఫ్ మేనేజరు కృష్ణ కిశోర్‌తో కలిసి డీఎంహెచ్‌వో ప్రారంభించారు. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా 75వ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ జూన్ 14వ తేదీ ప్రపంచ రక్తదాతల దినోత్సవం నిర్వహించడం జరుగుతోందన్నారు. సర్వజన ఆసుపత్రి, ఇతర బ్లడ్‌బ్యాంకు వారు వారం రోజుల పాటు స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రిమ్స్ బ్లడ్ బ్యాంకు వారు స్థానిక ఎయిర్‌పోర్టులో ఉదయం 10 గంటలకు రక్తదాన అభినందన కార్యక్రమాలు, రక్తదాన శిబిరం నిర్వహించడం జరుగుతోందని, రక్తదాతలు పాల్గొని విజయ వంతంచేయాలని డీఎంహెచ్‌ఓ, జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డాక్టర్ రవిబాబులు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజరు అనిల్‌కుమార్, బ్లడ్‌బ్యాంకు డాక్టర్ రాజేంద్ర, క్లస్టర్ ప్రోగ్రామ్ అధికారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్మారకాలుగా చింతకుంట రేఖాచిత్రాలు

ముద్దనూరు జూన్13(ఆంధ్రజ్యోతి): చింతకుంట ఆదిమానవుడి రేఖా చిత్రాలను జాతీయ స్మారకాలుగా గుర్తించాలని అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు ప్రధానమంత్రి నరేంద్రమోడీకి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన ప్రధాన మంత్రి కార్యాలయం ఆ విజ్ఞప్తిని పరిశీలించాలని కేంద్ర సాంస్కృతిక,మంత్రిత్వ శాఖకు పంపింది. ప్రస్తుతం చింతకుంట ఆదిమానవుడి రేఖాచిత్రాలు జాతీయ స్మారకాలుగా గుర్తించే ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

నవధాన్యాల సాగు లాభదాయకం

వల్లూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వరి సాగుకు ముందు నవధాన్యాల సాగుతో లాభాలు ఉంటాయని జిల్లా పీఎండీఎస్ ప్రాజెక్టు మేనేజరు ప్రవీన్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దపుత్త గ్రామంలో స్థానిక రైతు తాడిగొట్ల రాఘవరెడ్డి పొలాన్ని ఆయన సందర్శించారు. పంట వేసుకునే ముందు భూమిలో నవధాన్యాలు సాగు చేసుకుంటే భూమిలో పోషకపదార్థాలే కాకుండా భూమి కూడా సారవంతం అవుతుందన్నారు. అలాగే పంటకు వచ్చే తెగుళ్లను కూడా అరికట్టవచ్చన్నారు. ఎరువుల వాడకం కూడా తక్కువగా ఉంటుందన్నారు. వరి సాగు చేసేముందు ఘనజీవామృతం, జీవామృతం తప్పకుండా వాడుకోవాలని సూచించారు. ప్రొఫెసరు భరత్‌కుమార్‌రెడ్డి, ఎన్‌ఎఫ్‌ఏ నరసింహారెడ్డి, వెంకట్రామిరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జ్ ఓబులయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, రిసోర్స్ పర్సన్స్ విజయలక్ష్మి, ఓబులమ్మ పాల్గొన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కలసపాడు, జూన్ 13 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని జాతివర్తిపల్లె- చింతలపల్లె మధ్యలో శుక్రవారం ఎలిజబెత్ (22) అనే యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు పోరుమామిళ్ల మండలం కవలకుంట్ల గ్రామానికి చెందిన నారిపోగుల ఓబయ్య కుమార్తె ఎలిజబెత్ తమిళనాడులో మహిళలు, యువతులకు కుట్టుమిషన్‌లో శిక్షణ ఇప్పిస్తూ సామాజిక సేవ చేస్తుంటుంది. రెండు నెలల క్రితం తల్లిదండ్రులు పెళ్లి సంబంధం చూడగా ఆమె తిరస్కరించింది. శుక్రవారం జాతివర్తిపల్లె -చింతలపల్ల మధ్య ప్రధాన రహదారి పక్కన ఆమె మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోరుమామిళ్ల, కలసపాడు పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి విచారణ చేస్తున్నారు. మృతురాలి సోదరుడు, బాబాయిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మృతదేహాన్ని పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని.. వివాహిత ఆత్మహత్య

కాశినాయన, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన నీలం అనురాధ(28)అనే వివాహిత ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ యోగేంద్ర తెలిపారు. మండలంలోని చింతల పల్లెకు చెందిన అంకయ్య కూతురు అనూరాధను ఐదేళ్ల క్రితం ఓబు ళాపురం గ్రామానికిచెందిన నీలం వెంకటరమణయ్య కుమారుడు వెంకటేశ్వర్లుకు ఇచ్చి వివాహం చేశారు. వారికి ప్రస్తుతం మూడేళ్ల కూతురు ఉంది. సీఆర్‌పీఎఫ్ లో పని చేసే వెంకటేశ్వర్లు ఇటీవల సెలవుపై గ్రామానికి వచ్చి, నాలుగు రోజుల క్రితమే డ్యూటీకి వెళ్లా డు. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు కారణాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

ప్రొద్దుటూరులో వ్యక్తి..

ప్రొద్దుటూరు రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. టూ టౌన్ ఎస్‌ఐ ధనుంజయుడు తెలిపిన వివరాల మేరకు ప్రొద్దుటూరు పట్టణంలోని విజయనగరం వీధికి చెందిన రెడ్డివీర రవిశంకర్ (36) ఆటోడ్రైవర్. మద్యానికి బానిసై సుమారు రూ.5 లక్షల దాకా అప్పులు చేశాడు. వీటిని తీర్చే మార్గం కానరాక గురువారం ఉదయం ఇంటినుంచి ఆటో తీసుకుని వెళ్లిపోయాడు. శుక్రవారం ఉదయం జమ్మలమడుగు బైపాస్‌రోడ్డులోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న ఖాళీ స్థలంలో ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడు రవిశంకర్‌గా గుర్తించారు. అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ..

కడప క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కడప - కృష్ణాపురం రైల్వేస్టేషన్ల మధ్య ఓ వ్యక్తి రైలు కింద పడి మృతి చెందినట్లు కడప రైల్వే పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు మృతి చెందిన వ్యక్తి వయసు 35 ఉంటుందని,తెల్లని ఫుల్‌హ్యాండ్ చొక్కాపై నీలం రంగు పూలు ఉన్నాయని, బ్లూ కలర్ లోయర్ ధరించి ఉన్నాడని తెలిపారు. వివరాలకు రైల్వే ఎస్సై 9440900811 కు ఫోన్ చేసి మరింత సమాచారం తెలుసుకోవాలని కోరారు.

రూ. 1.20 కోట్లతో కేసీ ప్రధాన కాలువ అభివృద్ధి



కేసీ కాల్వలో పూడిక తీస్తున్న చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి

చెన్నూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కేసీ ప్రధాన కాల్వలో పూడికతీతతో పాటు, ఆయకట్టు రోడ్లు, ఉప కాల్వల అభివృద్ధి పనులకు 1,20,64,000 రూపాయలు మంజూరైంది. కేసీ ప్రధాన కాల్వలో పూడిక తొలగించడంతోపాటు ఆయకట్టు రోడ్ల బాగు చేయాలని రైతులు కోరినా ఫలితం లేకుండా పోయింది. అయితే, ప్రస్తుత ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో 15 పనులను చేపడుతున్నారు. ఇందులో కేసీ ప్రధాన కాల్వలో ఐదు చోట్ల పూడిక తీత పనులకు రూ. 39.89 లక్షలను వెచ్చిస్తున్నారు. ఈ పనుల్లో మూడు ప్రధాన కాలువకు సంబంధించినవి కాగా, మిగిలినవి చెన్నూరు, కొక్కి రాయపల్లె కాల్వలు. ఉప్పరపల్లె, ఖాదర్‌ఖాన్ కొట్టాలు, శేషయ్యగారి పల్లె, చిన్నమాచుపల్లె వద్ద ఉన్న ప్రధాన కాల్వపై ఆయకట్టు రోడ్లను వేయనున్నారు. ఈ పనులకు ఒక్కోదానికి రూ.7.97 లక్షలు మంజూరైంది. గోపవరం, చెన్నూరు, ఉప్పరపల్లె ప్రాంతాల్లో కేసీ ఉప కాల్వలకు ఆయకట్టు రోడ్లు వేస్తున్నారు. కొండ పేట చెరువుకు వెళ్లే డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌లో పూడిక తీతతో పాటు రూ.7.98 లక్షలతో రోడ్డు వేయనున్నారు. చెన్నూరు ఉప కాల్వ పరిధిలో గ్యాస్ గోడౌన్ నుంచి రూ. 7.99 లక్షలతో ఆయకట్టు రోడ్డు, వల్లూరు మండలంలోని ఆదినిమ్మాయ పల్లె ఆనకట్ట వద్ద 8.99 లక్షలతో ఆయకట్టు రోడ్డు వేస్తున్నారు.

పనులు ప్రారంభించిన డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్

కేసీ ప్రధాన కాల్వలో పూడిక తీత పనులను డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ టి.వెంకటసుబ్బారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ముందుగా ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట నుంచి మొదలయ్యే ప్రధాన కాల్వలో పూడికతీత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఏఏ పనులు అవసరమో, ఎక్కడెక్కడ పనులు చేపట్టాలన్న విషయాన్ని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి నిధులు మంజూరు చేయించారన్నారు. ముళ్లపొదలు పెరగడంతో మూసుకుపోయి ఆయకట్టు రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి

- మెడికల్ ఆర్డీకి ఎన్జీవో సంఘ నేతల వినతి



మెడికల్ ఆర్డీకి వినతిపత్రం అందజేస్తున్న ఎన్జీవో నేతలు

కడప,కలెక్టరేట్, జూన్13,(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ రామగిడ్డయ్యకు ఏపీ ఎన్జీవో సంఘ నేతలు విన్నవించారు. శుక్రవారం పాత రిమ్స్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఇతర జిల్లాల నాయకులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీఎన్జీవో సంఘం నాయకుల బదిలీల్లో ఆఫీసు బేరర్లకు ప్రభుత్వం ఇచ్చిన 9 ఏళ్ల మినహాయింపు ఇవ్వాలన్నారు. ఆఫీసు బేరర్లు జాయిన్ అయినప్పటి నుంచి వారి సర్వీసు కాలాన్ని లెక్కించాలని కోరారు. జీఏడీ సర్క్యులర్ మెమోలో ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కర్నూలు జిల్లా అధ్యక్షుడు వెంగళరెడ్డి ,అనంతపురం జిల్లా అధ్యక్షుడు చంద్ర శేఖర్ రెడ్డి, రాష్ట్ర సహాధ్యక్షుడు దస్తగిరి రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శులు రవికుమార్, చంద్రమోహన్, బాల పుల్లయ్య, హుసేన్ రెడ్డి, వేణుగోపాల రెడ్డి, ప్రవీణ్, రాంమోహన్, పద్మనాభం వివిధ యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం



రవి, వినోద్ (ఫైల్ ఫొటోలు), వినీల్‌కుమార్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

కడప క్రైం/మైదుకూరు రూరల్, జూన్ 13 (ఆంధ్ర జ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. కడప ట్రాఫిక్ ఎస్‌ఐ జయరాములు కథనం మేరకు.. కడప చలమా రెడ్డిపల్లెకు చెందిన నంద్యాల రవి (32) ప్రైవేటు పనులు చేస్తుంటాడు. రాయచోటి వినోద్ (26) ప్రైవేటు ఫైనాన్స్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈ ఏడాది కడపకు చెందిన యువతితో అతనికి వివాహం జరిగింది. వినోద్ భార్య ప్రస్తుతం గర్భిణి. శుక్రవారం రవి, వినోద్ ఆలంఖాన్ పల్లెకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా వారు ప్రయాణి స్తున్న స్కూటీని షిరిడి సాయి ఎలక్ట్రికల్స్ సంస్థకు చెందిన క్యాంపర్ రామాంజనే యపురం నుంచి ఆలంఖాన్‌పల్లె రింగు రోడ్డువైపు వెళుతూ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇరువురు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీ సులు మృతదేహాలను రిమ్స్ మార్చురీకి తర లించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారు ఢీకొని..

మైదుకూరు మండలంలోని నెల్లూరు కొట్టాలుకు చెందిన కొండా వినీల్ కుమార్ రెడ్డి(44) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గురువారం మధ్యాహ్నం పాతపాలెం వద్ద నడుచుకొంటు మైదుకూరు వైపు వస్తుం డగా వెనుక నుంచి కారు ఢీకొనగా అతను ఆసుపత్రిలో చికిత్స చేసుకొని ఇంటికి వెళ్లాడు. శుక్రవారం తెల్లవారు జామున ఉన్నట్లుండి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నీలో చిత్తూరు, కడప జట్ల విజయం



రణధీర్‌రెడ్డి



ఆర్త్రిత్‌రెడ్డి



సాయితేజశ్రీ

కడప స్పోర్ట్స్ జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-19 మెన్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో శుక్రవారం చిత్తూరు, కడప జట్లు ఆధిక్యం ప్రదర్శించాయి

ఏసీఏ క్రికెట్ స్టేడియంలో..

నగరంలోని వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో టాస్ నెగ్గిన అనంతపురం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 229 పరుగులు చేసింది. ఇందులో భువనేశ్వర్ 65 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 33.4 ఓవర్లలో కేవలం 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 231 పరుగులు సాధించి విజయకేతనం ఎగురవేసింది. లోహిత్ లక్ష్మీనారాయణ 125 పరుగులతో నాటౌట్‌గా నిలిచి విజయంలో కీలకపాత్ర పోషించాడు.

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో..

కేఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో టాస్ నెగ్గిన కడప జట్టు 48.4 ఓవర్లలో 243 పరుగులకు ఆలౌటైంది. ఈ జట్టు క్రీడాకారులు రణధీర్‌రెడ్డి 65 పరుగులు, ఆర్త్రిత్‌రెడ్డి 61 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 37.5 ఓవర్లలో 207 పరుగులకు ఆలౌటైంది. ఇందులో తోషిత్‌యాదవ్ 77 పరుగులు చేశాడు. దీంతో కడప జట్టు 36 పరుగుల తేడాతో విజయం సాధించింది.

మహిళా క్రికెట్‌లో కడప జట్టు విజయం

నెల్లూరులో జరుగుతున్న ఏసీఏ అండర్-15 ఉమెన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ పోటీల్లో శుక్రవారం కడప- నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ నెగ్గిన కడప జట్టు బ్యాటింగ్‌కు దిగి నిర్ణీత 25 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 200 పరుగులు చేసింది. ఇందులో సాయితేజశ్రీ 113 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 25 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 115 పరుగులు మాత్రమే చేసి ఓటమి చవిచూసింది. దీంతో కడప జట్టు 85 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది.


కుప్పలు తెప్పలుగా చెత్తా చెదారం

అధ్వానం... పాతబస్టాండ్

ఎటు చూసినా చెత్తా చెదారం... దోమలకు ఆవాసం




బస్సులు నిల్చునే ప్లాట్ ఫాం దుస్థితి, అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లు

కడప మారుతీనగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కడప పాత బస్టాండ్ గత కొన్ని సంవత్సరాలుగా ప్రయాణికుల సేవలో తరిస్తోంది. కడప జిల్లాలోని వివిధ డిపోల నుంచి (కడప-మైదుకూరు-ప్రొద్దుటూరు- జమ్మల మడుగు-బద్వేల్-పులివెందుల) ఆర్టీసీకి చెందిన పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రధానంగా జిల్లాలోని పల్లె ప్రాంతాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపా రులు, రైతులు, జిల్లా కేంద్రమైన కడప నగరానికి నిత్యం వస్తూ వుంటారు. వారి పనులు కాగానే తిరిగి వారి వారి గమ్యస్థానాలకు చేరుతుంటారు. ఆ క్రమంలో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల కోసం పాత బస్టాండ్‌కు చేరుకోవాల్సివుంటుంది. బస్సుల రాక కోసం బస్టాండ్‌లో వేచి వుండేందుకు వీలుగా సరైన సౌకర్యం లేనప్పటికీ వున్న సిమెంట్ దిమ్మెలు కూడా అపరిశుభ్రంగా దర్శనిమిస్తుంటాయి. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిపోయే ప్రయాణికులకు కనీసం కూర్చునే వెసులుబాటుకూడా లేని దుస్థితి లో పాత బస్టాండు వుంది. పల్లెల నుంచి వచ్చే ప్రయాణికులకు చాలామందికి చదువు రాకపో వడంతో వారు వెళ్లాల్సిన బస్సు ఎప్పుడొస్తుం దో కూడా తెలియదు. దీంతో వచ్చే ప్రతీ బస్సు ఎక్కడికెళుతుందని వాకబు చేస్తుంటారు. ఇదిలా వుండగా బస్టాండ్ ఆవరణం మొత్తం చెత్తా చెదారం, ప్లాస్టిక్ చిత్తుకాగితాలు ఎక్కడ పడితే అక్కడ దర్శనమిస్తుంటాయి. వాటిని ఎప్పటికప్పుడు శుభ్రంగా తీయాల్సిన కార్పొరేషన్ సిబ్బంది వారికి ఇష్టమొచ్చినప్పుడు అలా వచ్చి ఇలా మాయమౌతున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో బస్టాండ్ ఆవరణం మొత్తం అపరిశుభ్రతకు నిలయంగా మారింది. దీనికి తోడు మేమేమీ తక్కువ కాదన్నట్లుగా ఇటీవల కురుస్తున్న చిన్నపాటి వర్షానికి బస్టాండ్ వద్ద అక్కడక్కడా నిలబడిన వర్షపునీటిలో దోమలు, ఈగలు కుప్పలు తెప్పలుగా ఉన్నాయి.

నిరుపయోగంగా బస్టాండ్‌పై అంతస్థు అద్దెరూములు..:

బస్టాండ్‌పై అంతస్థులో వున్న అద్దె రూములు కొన్ని సంవత్సరాలుగా నిరుపయోగంగా వుంది. ఆ రూముల తాలూకు వాటి పైకప్పు పెచ్చులు ఎప్పుడు ఊడి పడతాయో చెప్పలేని విధంగా వున్నాయి. కొన్ని రూము లలో ఇప్పటికే పైకప్పు పెచ్చులు రూములలో ఊడిపడి వున్నాయి. కొన్ని రూమలలోకి వెళ్లాలంటే ముక్కుపుటలు బ్రద్దలయ్యే లా దుర్వాసన వెదజల్లుతోంది. అంతలా ఆ ప్రాంతం కంపుతో నిండుకుంది.

కుప్పం అంకాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



చక్రాయపేట,జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుప్పం గ్రామంలో నూతనంగా ప్రారంభించిన అంకాలమ్మతల్లి దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేసి 41 రోజులు పూర్తికావడంతో అర్చకుడు అనంతశర్మ స్వామి అమ్మవారికి అభిషేకాలు హోమాలు నిర్వహించారు. 41 రోజుల పాటు గ్రామంలో ఎలాంటి జంతువధను చేయకుండా భక్తితో అంకాలమ్మతల్లిని గ్రామస్థులు పూజించారు. అంకాలమ్మతల్లికి ప్రత్యేకంగా అలంకరించి రెడ్డప్పరెడ్డి,గాలి కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థులు అమ్మవారి హోమం కార్యక్రమంలో పాల్గొన్నారు.

సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

పెండ్లిమర్రి, జూన్ 13(ఆంధ్రజ్యోతి):కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్యఘర్ యోజన పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈఈ హరి సేవ్లానాయక్ తెలిపారు.మిట్టమీదపల్లె సబ్‌స్టేషన్,నందిమండలం సబ్‌స్టేషన్ల పరిధిలో సోలార్ విద్యుత్ వినియోగం,ఆవశ్యకత గురించి వినియోగదారులకు అవగాహన కల్పించారు. సమావేశంలో డీఈ వేంకటేశ్వర్లు,ఏఈలుజయరామయ్యనవనీతసిబ్బంది పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సహకరించాలి

పెండ్లిమర్రి, జూన్ 13(ఆంధ్రజ్యోతి):మండల అభివృద్ధికి అందరూ సహకరించాలని ఎంపీపీ వరలక్ష్మి తెలిపారు. ఎంపీడవో సభాభవనంలో శుక్రవారం మండల సర్వ సభ్యసమాశేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అన్నిశాఖల మండలఅధికారులు తమనివేదికలు చదివి వినిపించారు.ఈ సమావేశంలో జడ్పీ వైస్ చైర్మెన్ బాలయ్య, ఎంపీడీవో జగన్ మోహన్ రెడ్డి,తహసీల్దార్ అనూరాధ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. తక్షణం సీఓఏ పర్మిషన్ ఇప్పించాలని కోరారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్‌కుమార్, సాయికృష్ణ, రామాంజనేయులు, సుష్మ, సింధు, జగదీష్, సందీప్, శివ, ఏడుకొండలు, సుదాకర్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు హాకీ మైదానంలో డెమో యోగా

పులివెందుల రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైఎస్సార్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని హాకీ మైదానంలో శనివారం డెమో యోగా కార్యక్రమం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ రాముడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఈ డెమో యోగా కార్యక్రమం చేపట్టామన్నారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి 8గంటల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు సహకరించండి

వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ఆంజనేయులు

వేముల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రామహిళలను ప్రోత్సహించేలా వారికి చిన్నతరహా పరిశ్రమల స్థాపనకు సహకరించాలని వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ఆంజనేయులు కోరారు. స్థానిక కార్యాలయంలో యూనియన్, ఏపీజీ బ్యాంకుల మేనేజర్లతో డ్వాక్రా వార్షిక రుణ అమలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్, ఏపీజీ బ్యాంక్ మేనేజర్, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

విమాన ప్రమాదం తీవ్రవిషాదం

టీడీపీరాష్ట్ర నాయకుడు బాలిశెట్టి హరిప్రసాద్



కడప నాగరాజుపేట,జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్ విమాన ప్రమాదం తీవ్ర విషాదమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ పేర్కొన్నారు. హరిటవర్స్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 241 మంది ప్రయాణికులతో లండన్ వెళ్తున్న విమానం, టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కుప్పకూలడం ఊహించలేనిదన్నారు. వైద్యకళాశాల వసతిగృహాలపై విమానం కూలడం, విద్యార్థుల ప్రాణాలు ప్రమాదంలో పడటం అత్యంత కలచివేసిన విషయమన్నారు. సమావేశంలో గంధం ప్రసాద్, నాగరాజు, బల్లి బాబు కృష్ణమూర్తి, రాజు తదితరులు పాల్గొన్నారు.

కడప,కలెక్టరేట్..: అహమ్మదాబాద్‌లో విమాన ప్రమాదం అత్యంత విషాదకరమైనదని, తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యామని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్.డి.విజయజ్యోతి శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. ప్రమాద బాధితుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ తరుపున తమ సానుభూతి తెలిపారు.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలన్నీ వర్తింపజేయాలి

కడప సెవెన్ రోడ్స్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలు ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు, స్కీమ్‌వర్కర్లకు తల్లికి వందనం, రేషన్‌కార్డులు మంజూరు చేసి,ప్రభుత్వ పథకాలు వర్తించేటట్లు చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి ఒకప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ విభాగాల్లో మూడులక్షల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పలు రకాల సేవలందిస్తున్నారని తెలిపారు. వీరి కుటుంబ సభ్యులకు తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్, వృద్ధాప్యం పింఛన్లు, ఇళ్లస్థలాలు వంటిపథకాలు వర్తింపజేయడం లేదని తెలిపారు.

దళితుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి


మాట్లాడుతున్న ఎస్సీసెల్ నాయకుడు రామాంజనేయులు

కమలాపురం రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీల అభివృద్ధికి రాష్ట్రంలోని చంద్ర బాబు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రామాంజనేయులు అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు పుల్లగూర శ్రీనివాసులు అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దళితుల అభివృద్ధి కోసం పాటుపడు తోందని దళితుల సంక్షేమానికి అన్నిరకాల చర్యలు చేపడుతోందన్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తానరసింహారెడ్డి, ఎమ్మెల్యే పుత్తాక్రిష్ణ చైతన్యరెడ్డి నియోజకవర్గానికి తాగు, సాగునీరు కోసం నీరు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రాంప్రసాద్, ఉపాధ్యక్షుడు మైరైన్, ఎంపీసీఎల్ అధ్యక్షుడు రఘు, కార్యదర్శి బాబు, ఎస్సీ నాయకులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ముఖాల్లో ఆనందం చూస్తున్నాం


మాట్లాడుతున్న ఖాదర్‌బాషా

కమలాపురం రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : సూపర్‌సిక్స్ పథకాల్లో తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వం అమలు చేసిందని ముస్లిం మైనార్టీ కడప పార్లమెంటు అధ్యక్షుడు ఖాదర్ బాషా తెలిపారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. నేడు కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం తల్లికి వందనం పథకాన్ని అమలు చేసిందని అన్నారు.

హామీలు అమలు చేయాలి

కడప మారుతీనగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్స్‌కు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవా ధ్యక్షుడు గుంటి వేణు గోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కూటమి ప్రభుత్వం ఆశాలకు ప్రకటించిన హామీల జీవోలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా సమితి పిలుపుమేరకు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహారదీక్ష శిబిరాన్ని జిల్లా శ్రామిక మహిళా ఫోరమ్ కన్వీనర్ ఎన్.విజయ లక్ష్మి, ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి నాగసుబ్బారెడ్డి దీక్షలో కూర్చున్న ఆశా కార్య కర్తలకు రిబ్బన్ కండువాలు వేసి శిబిరాన్ని ప్రారంభించారు. కాగా ఆశాలు చేస్తున్న రిలే నిరాహారదీక్షా శిబిరాన్ని జిల్లా లెప్రసీ అధికారి సందర్శించి ఆశాలకు రావాల్సిన లెప్రసీ అలవెన్స్ విడుదల కానున్నాయని, మరో రెండు మూడు రోజులలో అందగలవని హామీ ఇచ్చారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు నరసమ్మ, శాంతమ్మ, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుంటి వేణుగోపాల్

రాక్షసపాలన అంతం...సుపరిపాలనకు నాంది


అన్నదానం చేస్తున్న రఘునాథరెడ్డి, టీడీపీ నేతలు

వేంపల్లె, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాక్షసపాలన అంతమై కూటమిసుపరిపాలన ప్రారంభమై ఏడాది పూర్తైందని టీడీపీ మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తైన సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు నందిపల్లెకు చెందిన పందిళ్లపల్లె రామగంగిరెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్‌నగర్ కాలనీలోని వృద్ధాశ్రమంలో శుక్రవారం అన్నదానం చేశారు. పండ్లు పంచిపెట్టారు. ఆశ్రమానికి టీడీపీ మండల పరిశీలకుడు రూ.10వేలు ఆర్థికసాయం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మునిరెడ్డి, టీడీపీ మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, దేవస్థాన మాజీ సభ్యులు జీవీ రమణ, మల్లికార్జున, రాజా, మైనార్టీ నాయకులు మహమ్మద్,తక్కెళ్ల షరీఫ్, యాసిన్, యువనాయకులు శివకృష్ణ, మనోహర్ పాల్గొన్నారు.

రోడ్డుభద్రతపై ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన

కడప క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలు, నివారణ అంశంపై ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కడప ట్రాఫిక్ సీఐ డి.కే.జావీదు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులో ప్రయాణం అంటేనే సురక్షిత ప్రయాణమని అన్నారు. ఒక బస్సులో సుమారు 40 నుంచి 50 మంది ప్రయాణికుల ప్రాణాలు ఒక డ్రైవరు చేతిలోనే ఉంటాయి. డ్రైవరు ఎల్లప్పుడూ జాగ్రత్తగా బస్సును నడుపుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, ఆర్టీసీ డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు డ్రోన్ స్ప్రేయర్ పంపిణీ


డ్రోన్ స్ప్రేయరును రైతులకు అందిస్తున్న దృశ్యం

పులివెందుల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం 80శాతం సబ్సిడీపై మంజూరుచేసిన డ్రోన్ స్ప్రేయర్‌ను రైతులకు వేంపల్లె మండల టీడీపీ పరిశీలకుడు అజ్జుగుట్ట రఘునాథరెడ్డి పంపిణీచేశారు. శుక్రవారం స్థానిక మినీ సెక్రటేరియట్ వద్ద ఈ డ్రోన్ స్ప్రేయర్‌ను రైతులకు అందించారు. ఇప్పట్ల గ్రామానికి చెందిన శ్రీలక్ష్మీ వెంకటేశ్వర రైతు మిత్ర గ్రూపునకు సంబంధించిన రైతులకు ఈ డ్రోన్ స్ప్రేయర్ అందించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి, లింగాల, పులివెందుల ఏఓలు రమేష్, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారు ఈకేవైసీ చేసుకోవాలి


ఈకేవైసీని పరిశీలిస్తున్న ఏఓ శ్యామ్‌బాబు

వీరపునాయునిపల్లె, జూన్ 13 (ఆంధ్ర జ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులు తప్పకుండా ఈ కేవైసీ చేసుకోవాలని ఏవో శ్యామ్‌బాబు సూచించారు. శుక్రవారం మండలంలోని తలపనూరు రైతుసేవా కేంద్రంలో జరుగుతున్న ఈకేవైసీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అర్హుల జాబితా ప్రతి రైతు సేవా కేంద్రంలో ఉంచామన్నారు. ఆయా రైతులు తప్పకుండా ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. ఈ- కేవైసీ చేసుకున్న రైతులకు మాత్రమే అన్నదాతసుఖీభవ పథకం వర్తింస్తుందన్నారు.

పరిశుభ్రతతోనే దోమల నివారణ


దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

చెన్నూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : పరిశుభ్రతతోనే దోమలను నివారించవచ్చని కమలాపురం నియోజకవర్గ సబ్ యూనిట్ ఆఫీసరు మురళీధర్ అన్నారు. మండలంలోని కనుపర్తి గ్రామంలో శుక్రవారం మలేరియా నివారణ మాసోత్సవంలో బాగంగా ఆ ప్రాంత ప్రజలకు వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఎస్‌లు సుబ్బరామయ్య, చెన్నయ్య, ఏఎన్ఎం, ఆశా అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

పులివెందుల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అర్బన్ సీఐ చాంద్‌బాష హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని పలుప్రాంతాలలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి బైకులు,కార్లు తదితర వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

'చతికిలబడిన డబులింజన్ సర్కార్'

వేంపల్లె, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అప్పుల్లో దూసుకుపోతున్న రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, అభివృద్ధిలో చతికిలపడిందని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో డబులింజన్ సర్కార్ దూసుకుపో తున్నదని టీడీపీ నాయకులు చెప్పడం హాస్యాస్పదమన్నారు. రాయల సీమకు, ఉత్తరాంధ్రకు బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ రాలేదు. కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగారం, దుగరాజపట్నం ఓడరేవు నిర్మాణం కాలేదన్నారు. రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర గ్రాంట్ ఇవ్వలేద న్నారు.

సీబీఆర్‌కు ఆగిపోయిన కృష్ణాజలాలు

లింగాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు ఎత్తిపోతల ద్వారా తరలిస్తున్న కృష్ణాజలాలను అధికారులు శుక్రవారం ఆపేశారు. అనంతపురం జిల్లా యల్లనూరు మండలం గొడ్డుమర్రి గ్రామంలోని ఎత్తిపోతల పథకం ద్వారా వచ్చే నీరు చెరువు నుంచి సమీపంలో ఉన్న పొలాల్లోకి వెళ్తోంది. ఆయా పొలాల్లో పైర్లు నూర్పిడి దశకు ఉండడంతో రైతులు అభ్యర్థన మేరకు నీటి పారుదల అధికారులు పది రోజుల వరకు ఎత్తిపోతల ద్వారా నీటి తరలింపు ఆపేశారు. మే 28వ తేదీ నుంచి రోజుకు 900 క్యూసెక్కుల నీటిని గండికోట నుంచి సీబీఆర్‌కు తరలించారు.

తల్లికి వందనం..ఇంటింటా ఆనందం


జమ్మలమడుగులో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నేతలు


ఖాజీపేటలో క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు


రాజుపాళెంలో సంతోషం వ్యక్తం చేస్తున్న కుప్పే రమణమ్మ, ముగ్గురు పిల్లలు

జమ్మలమడుగు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులకు తల్లి వందనం పథకం కింద రూ.13వేలు తల్లి ఖాతాలో గురువారం జమ చేయడంతో ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరుస్తోంది. ఇద్దరు, ముగ్గురు పిల్లలు ఉన్న తల్లుల ఖాతాలో రూ.26వేలు, రూ.39వేలు జమకావడంతో వారంతా ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, విద్యాశాఖా మంత్రి నారాలోకేశకు ధన్యవాదాలు తెలుపుతున్నారు. కాగా జమ్మలమడుగు పాత బస్టాండులో గాంధీ విగ్రహం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి టీఎన్ఎస్ఎఫ్ ఆద్వర్యంలో శుక్రవారం టీఎన్ఎస్ఎఫ్ నాయకులు, కూటమి నాయకులు క్షీరాభిషేకం చేశారు. ప్రభుత్వం తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా ఒక్కొక్కరికి రూ.13 వేలు జమ చేసి ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారన్నారు. సూపర్-6 పథకాల్లో బాగంగా అన్ని హామీలను చంద్రబాబు ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ వస్తుండ డంతో వైసీపీ నేతల్లో భయం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి నవీన్‌రాయల్, టీడీపీ నాయీబ్రాహ్మణ కడప పార్లమెంటు అధ్యక్షుడు గజ్జెల గోవిందు, టీడీపీ నాయకులు ఐఎల్ చిన్న, నాని, సిద్దూరాయల్, అధ్యక్షుడు చామంతి మహేష్, పార్థసారథి, ప్రసాద్, ప్రతాప్, మధు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిలో పండుగే..

ఖాజీపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకంకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిధులిచ్చి తల్లుల ఖాతాల్లో జమ చేయడంతో ప్రతి ఇంటిలో పండుగ వాతావరణం నెలకొందని టీడీపీ మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పుల్లూరు దళితవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో ఒక్కరికి మాత్రమే డబ్బులు వచ్చేవని, చంద్రబాబునాయుడు ముగ్గురు పిల్లలు ఉన్నా డబ్బులు వారి ఖాతాల్లో జమ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, కేసీకెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ రవి, నంద్యాల సుబ్బయ్య, చుట్టే రాము, మామిళ్ల క్రిష్ణారెడ్డి, పల్లె గంగాధర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సంతోషం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

రాజుపాలెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం సూపర్‌సిక్స్‌లో భాగంగా తల్లికి వందనం పథకం కింద తల్లుల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.13వేలు జమ చేయడంతో శుక్రవారం తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 39 స్కూళ్లలో 2వేల మంది పైబడ విద్యార్థులు 1వతరగతి నుంచి ఇంటర్ వరకు విద్యనభ్యసిస్తున్నారు. తల్లుల ఖాతాల్లో అమౌంటు పడుతుండడంతో తల్లులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పిల్లలకు కావాల్సిన నోటు పుస్తకాలు తదితర వాటిని కొనుగోలు చేసుకునేందుకు ఇది మంచి సదవకాశమని వారు తెలిపారు.

తల్లికి వందనం డబ్బులు జమ

మైదుకూరు రూరల్ ,జూన్ 13(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా తల్లికి వందనం పథకం కింద తల్లుల అకౌంట్లలో శుక్రవారం డబ్బులు జమ అయ్యాయి.ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా ఒక్కొక్కరికి రూ.13 వేల చొప్పున అకౌంట్‌లో జమ అవుతున్నాయి.

మైదుకూరు, మున్సిపాలిటీ, మండలంలో చాలా వరకు తల్లుల అకౌం ట్‌లో డబ్బులు జమ అవుతున్నాయి. పాఠశాల ఓపెన్ చేసే సమయంలో డబ్బులు పడటంతో పిల్లల పుస్తకాలకు ,స్కూల్ ఫీజులకు డబ్బులు చాలా బాగ ఉపయోగపడుతున్నాయని తల్లిదండ్రులు చెబుతున్నారు.

సీఎం చంద్రబాబు సార్‌కు థ్యాంక్స్



మా కుమారుడు చరణ్ 8వ తరగతి చదువుతు న్నాడు.తల్లికి వందనం డబ్బులు పుస్తకాలకు, స్కూల్ ఫీజుకు చాలా ఉపయోగ పడుతోంది. సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు.

- కుమారుడితో తుపాకుల కొండమ్మ,మైదుకూరు

చంద్రబాబు మాట నిలుపుకొన్నారు



మాకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఒక్కరికే అమ్మవడి పథకం ద్వారా డబ్బులు అకౌంట్లలో పడేవి. కాని సీఎం చంద్ర బాబు హామీ ఇచ్చిన మేరకు మా ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం 26 వేల రూపాయలు అకౌంట్‌లో పడ్డాయి. సీఎం చంద్రబాబు మాట నిలుపుకొన్నారు.

- ఇద్దరు పిల్లలతో సునీత ,మైదుకూరు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎర్రగుంట్ల, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మున్సిపాలిటి పరిదిలో రెండవ శనివారం సందర్బంగా విద్యుత్ లైన్లలో నిర్వహణ పనులు చేస్తున్నందున ఉదయం 8.30గంటల నుంచి మద్యాహ్నం 1.30గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రియదర్శన్‌రెడ్డి తెలిపారు. ముద్దనూరు రోడ్డు, కడపరోడ్డు, వేంపల్లిరోడ్డు, రాణీవనం, వినాయకనగర్, సుందరయ్యనగర్, ప్రొద్దుటూరు రోడ్డు తోపాటు ఎస్టేట్ ఏరియాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

ముద్దనూరులోనూ..

ముద్దనూరు జూన్13(ఆంధ్రజ్యోతి)మండలంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శ్రీనివాసులరెడ్డి తెలిపారు.సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరాలో అంతరాయం కలుగుతుందని , వినియోగదారులు గమనించాలన్నారు.

జమ్మలమడుగులోనూ..

జమ్మలమడుగు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలో జమ్మలమడుగు మున్సిపాలిటీ, మైలవరం, పెద్దముడియం, ముద్దనూరు, కొండాపురం మండలాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని జమ్మలమడుగు ఏడీఈ రాజగోపాల్ తెలిపారు. అన్ని సబ్‌స్టేషన్ల వద్ద మెయింటినెన్స్ పనుల కారణంగా విద్యుత్తు అంతరాయం ఉంటుందన్నారు.

ఘనంగా జాతీయ టైలరింగ్ డే

పోరుమామిళ్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మదర్‌థెరిసా ఫౌండేషన్ ఆద్వర్యంలో రయాన్స్ టైలరింగ్ సెంటరులో జాతీయ టైలరింగ్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాశ్‌రెడ్డి పాల్గొని ప్రతి ఒక్కరికీ కుట్టుమిషన్ చాలా ముఖ్యమైన సాధనమన్నారు. అనంతరం కేక్ కట్ చేసి అక్కడున్న వారికి పంచిపెట్టారు. మాజీ ఎంపీటీసీ చిత్తా రోజిలీనా, ఓఎల్‌ఎఫ్ ప్రధానో పాధ్యాయురాలు ఆరోగ్యరాణి, ఉపాధ్యాయులు రాజారెడ్డి, డాక్టర్ చిత్తా అమితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు వాయిదా వేయాలి

కలసపాడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం శిక్షణ తరగతుల పేరుతో ఉపాధ్యాయులను బడులకు దూరం చేయడం సరికాదని వాటిని వాయిదా వేయాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి రమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కలసపాడులో విలేకరులతో మాట్లాడుతూ గత నెలలో పూర్తికావాల్సిన బదిలీలు పదోన్నతులు ప్రక్రియ పాఠశాలలు తెరిచేవరకు కొనసాగడంతో పిల్లల అడ్మిషన్లపై ఉపాధ్యాయులు దృష్టిసారించలేక పోతున్నారన్నారు. ఇంతలోనే తిరిగి శిక్షణ పేరుతో బడులకు దూరం చేస్తే అడ్మిషన్ ప్రక్రియ సజావుగా సాగే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం సరఫరా చేయడం సతోషంగా ఉందని కొనియాడారు.

సోలార్‌రూఫ్‌తో విద్యుత్ ఆదా


మాట్లాడుతున్న డీఈ భరణీకృష్ణ

దువ్వూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సోలార్ రూఫ్‌టాప్ ఇంటిపై నిర్మించుకోవడం ద్వారా విద్యుత్ బిల్లు ఆదా అవుతుందని విద్యుత్ శాఖ మైదుకూరు డీఈ భరణీకృష్ణ తెలిపారు. దువ్వూరులో శుక్రవారం సోలార్ రూఫ్‌టాప్‌పై వినియోగదారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీ శ్రీకాంత్, మైదుకూరు ఏఈ రాంభద్రయ్య, దువ్వూరు ఏఈ రాజ్‌కుమార్, విద్యుత్‌వినియోగదారులు పాల్గొన్నారు.

ప్రధాన డ్రైనేజి కాలువల్లో పూడిక తీత


ప్రధాన డ్రైనేజీ కాలువల్లో పూడికలు తీస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మున్సిపాలిటీలోని ప్రధాన డ్రైనేజి కాలువల్లో పూడికతీత కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. 2024 డిసెంబరు, 2025 జనవరి నెలల్లోనే ఈ పూడికతీత కార్యక్రమాన్ని చేశారు. రానున్న వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకుని సీడీఎంఏ విజయవాడ వారు ఆదేశాల మేరకు మళ్లీ పూడికతీత కార్యక్రమాన్ని చేపట్టినట్లు కమిషనర్ శేషఫణి తెలిపారు.

అంగన్వాడీ సెంటర్‌లో సామూహిక సీమంతాలు


గర్భవతులకు సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

కొండాపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండూరు అంగన్వాడీసెంటర్‌లో శుక్రవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భవతులకు ఐసీడీఎస్ సూపర్ వైజర్ భారతి సారె ఇచ్చారు అదేవిధంగా అంగన్వాడీలో కొత్తగా చేరే పిల్లలకు అక్షరభ్యాసం కూడా చేయించారు. అంగన్వాడీ వర్కర్ పద్మావతి పాల్గొన్నారు.

ముగిసిన దస్తగిరి స్వామి ఉరుసు

● ఓబులాపురంలో పోటా పోటీగా బండలాగుడు పోటీలు


బండలాగుడు పోటీలో పాల్గొన్న వృషభాలు

కాశినాయన జూన్13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబులాపురం గ్రామంలో గురువారం ప్రారంభమైన దస్తగిరి స్వామి దర్గా ఉరుసు ఉత్సవం శుక్రవారంతో ఘనంగా ముగిశాయి ఈ సందర్భంగా రెండవ రోజైన శుక్రవారం బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. మొత్తం 6 కాండ్ల ఎద్దులు పాల్గొనగా మొదటి బహు మతి రూ.1లక్ష మైదుకూరుకు చెందిన కుర్ర వెంకటేష్‌యాదవ్ వృషభాలు కైవసం చేసుకోగా రెండవ బహుమతి రూ.70 వేలు కడప జిల్లా రంగసాయి పల్లెకు చెందిన మార్తాల వెంకటసుబ్బారెడ్డి ఎద్దు, తృతీయ బహుమతి రూ.50వేలు తాడిపత్రికి చెందిన రమేష్‌బాబు ఎద్దు కైవశం చేసుకున్నాయి.

నిందితులకు రిమాండ్

ముద్దనూరు జూన్13(ఆంధ్రజ్యోతి):మండల పరిధి దేనేపల్లి గ్రామంలో బోల రామ్మోహన్ పై గొడ్డలితో దాడికి సంబంధించి నలుగురిని శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. వారిలో ఉత్తయ్య, శివ, శివశంకర్, నరసింహులు రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

నకిలీ పట్టాలపై ప్రత్యేక దృష్టి సారించాలి :ఎస్పీ


బద్వేలు రూరల్ పోలీసుస్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

బద్వేలు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి):బద్వేలులో నకిలీ పట్టాల వ్యవహారంపై ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. పట్టణంలోని అర్బన్, రూరల్ పోలీసుస్టేషన్‌లను శుక్రవారం జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి అర్బన్ సీఐ రాజగోపాల్, రూరల్ ఎస్ఐ శ్రీకాంత్, ఎస్ఐలు సత్యనారాయణ,జయరామిరెడ్డిలకు పలు సూచనలు ఇచ్చారు. ఎవరైనా నకిలీ పత్రాలతో పోలీసుస్టేషన్‌కు వస్తే వెంటనే కేసు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. బద్వేలు పట్టణంలోని ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టిసారించి చర్యలు చేపట్టాలన్నారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులను గౌరవించి వీలైనంత త్వరగా ఫిర్యాది సమస్యను పరిష్కరించాలన్నారు. శాంతి భద్రతలపై చర్యలు చేపట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. రాత్రివేళలో గస్తీ ముమ్మరం చేసి చోరీలపై నిఘాపెట్టాలన్నారు.

పదోన్నతుల తర్వాతే బదిలీలు చేపట్టండి


మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు రఘురామిరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులు నిర్వహించి ఆ తర్వాత బదిలీలు చేపట్టాలని ప్రొద్దుటూరు తాలూకా ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సచివాలయ ఉద్యోగుల బదిలీలలో ఉన్న అభ్యంతరాలపై మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులను మున్సిపల్ పరిధిలోనే ఒక వార్డు నుంచి మరో వార్డుకు, ఒక పంచాయతీ నుంచి మరో పంచాయతీకి బదిలీ చేయాలని పేర్కొన్నారు. దీనిపై పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రవిచంద్రారెడ్డిని ఎన్జీవో అసోసియేషన్ నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభంజన్‌రెడ్డి, కిరణ్, ప్రభాకర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉద్యోగులు, సిబ్బంది సహకారం మరువలేనిది


తహసీల్దారు అక్బల్‌బాషను సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

దువ్వూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, సిబ్బంది సహకారం మరువలేనిదని తహసీల్దారు అక్బల్‌బాష అన్నారు. దువ్వూరు నుంచి జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయానికి ఏవోగా బదిలీపై వెళుతున్న ఆయన మాట్లాడారు. దువ్వూరు తహసీల్దారుగా తొమ్మిది నెలలు పనిచేశానని, ప్రజల సమస్యలు వీలైనంత వరకు పరిష్కరించానని చెప్పారు. బదిలీపై వెళుతున్న సందర్భంగా శుక్రవారం స్థానిక కార్యాలయంలో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది ఆయనను శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు, రీసర్వే డిప్యూటీ తహసీల్దారు, ఆర్ఐతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే వ్యాధుల నియంత్రణ

బద్వేలు రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజలందరి భాగస్వామ్యంతో వ్యాధులను నియంత్రించవచ్చని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రాజుపాలెంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం మలేరియా మాసోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రైడే డ్రైడే కార్యక్రమం ప్రతి కుటుంబం పాటిస్తే దోమలు అదుపు చేయవచ్చన్నారు. దోమ కాటు వల్ల మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికున్‌గున్యా, మెదడువాపు తదితర వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. ప్రతి కుటుంబం పరిశుభ్రతను పాటించి దోమలను నివారించాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్‌ఎడ్యుకేటరు వెంగయ్య, సూపర్‌వైజరు శివరామిరెడ్డి, వెంకటమ్మ, హెల్త్ అసిస్టెంటు జనార్ధన్, ఎఎన్‌ఎం, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

సమసమాజ నిర్మాణానికే సీపీఐ పోరాటం


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జి.ఈశ్వరయ్య

బద్వేలు రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : సమసమాజ నిర్మాణం కోసమే సీపీఐ పోరాటాలు చేస్తుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈశ్వరయ్య పేర్కొన్నారు. జూలై 22 నుంచి 24వరకు బద్వేలులో నిర్వహించబోయే సీపీఐ జిల్లా మహాసభలు ఆగస్టు 20 నుంచి 24 వరకు ఒంగోలులో నిర్వహించబోయే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేసేందుకు శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఐదురోజులపాటు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి శిక్షణా శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజానాట్యమండలివంటి సంస్థలు ప్రజల అభ్యుదయానికి ఒక దీపస్తంభంగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు రామక్రిష్ణ, చంద్రశేఖర్, వీరశేఖర్, పల్లవోలు రమణ, వర్మ, ఇమ్మానుయేల్, పడిగె వెంకటరమణ పాల్గొన్నారు.

సీపీఐ పట్టణ కార్యదర్శిగా రెండో సారి బాలు ఎన్నిక



బద్వేలు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సీపీఐ బద్వేలు పట్టణ కార్యదర్శిగా రెండో సారి బాలు ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయం జేవీ.భవన్‌లో నిర్వహించిన పట్టణ సమితి నూతన కౌన్సిల్‌లో 35మంది ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో 2వ సారి పట్టణ కార్యదర్శిగా ఎన్నికైన బాలు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎన్నుకున్న సీపీఐ కార్యదర్శి జి.ఈశ్వరయ్య, బద్వేలు ప్రాంత ఇన్‌చార్జి వీరశేఖర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. బద్వేలు పట్టణ అభివృద్ధికి తీసుకోవాల్సిన ఉద్యమ కార్యాచరణను రూపొందించి తనవంతు బాధ్యత నిర్వహిస్తానన్నారు.

మద్యం షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

జమ్మలమడుగు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో మద్యం షాపులకు సంబందించి దరఖాస్తులు చేసుకోవడానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జమ్మలమడుగు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు తెలిపారు. జమ్మలమడుగు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మున్సిపాలిటీ పరిధిలో ఇండియన్ మేడ్ ఫారెన్ లిక్కర్, ఫారెన్ లిక్కర్ అమ్మకాల కోసం మద్యం షాపు లైసెన్సు గ్రాంట్స్‌కు సంబందించి జిల్లా ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో గెజిట్ నంబరు 38కి సంబందించిన మద్యం షాపునకు ఆసక్తిగల వ్యక్తులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు ఈనెల 13వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయని లైసెన్సులకోసం ఆన్‌లైన్ దరఖాస్తుల సమర్పణ కొరకు ఈనెల 19వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. ఈనెల 21వ తేదీ ఉదయం 9 గంటలకు కడప న్యూ కలెక్టరేట్ వద్ద లాట్ డ్రాల్ నిర్వహిస్తారన్నారు. దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు. ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాల కొరకు 6281363882 నంబరుకు ఫోన్ చేసి జమ్మలమడుగు ప్రాంతీయులు తెలుసుకోవచ్చన్నారు.

విమాన ప్రమాద మృతులకు ఘన నివాళి

జమ్మలమడుగు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అహ్మదాబాదులో గురువారం జరిగిన విమాన ప్రమాదంలో మృతిచెందిన వారందరికి మ్మలమడుగు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సింగం శివమోహన్‌రెడ్డి శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విమాన ప్రమాదంలో అశువులు బాసిన వారందరి ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నామన్నారు. అహ్మదాబాదు నుంచి లండన్‌కు బయల్దేరిన ఎఐ171 ఎయిర్ ఇండియా విమానం టేకాఫ్ అయిన కొద్ది నిమిషాలకే కుప్పకూలడంతో ప్రయాణికులు, పైలెట్లు, సిబ్బంది, భారతీయులు మొత్తం దాదాపు 242 మందితోపాటు మెడికోలు 20 మంది దుర్మరణపాలవడం దురదృష్టకరమన్నారు. మృతుల కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.